PRGI Reg No -"APTEL/26/A1193

నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 51, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శనివారం - 11 - ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-

## మహిళా రిజర్వేషన్లపై బీజేపీ 'మాస్టర్ ప్లాన్'.. పార్లమెంటు బిల్లుకు ముందే దేశవ్యాప్త ప్రచారం!

### ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళ బిల్లు చర్చకు రానుంది

ఢిల్లీ, : ఢిల్లీ వేదికగా రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. దశాబ్దాలుగా నలుగుతున్న మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణ బిల్లు పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీనిని ఒక చారిత్రాత్మక విజయంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. భారత రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. 2029 ఎన్నికల నుంచే చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు




## తమిళనాడు తెలుగు యువశక్తి కీలక నిర్ణయం




చెన్నై: తమిళనాడులో నివసిస్తున్న తెలుగు ప్రజల హక్కులు, గౌరవం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న తమిళనాడు తెలుగు యువశక్తి సంస్థ జరగబోయే ఎన్నికల నేపథ్యంలో కీలక రాజకీయ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా తమిళనాడులో తెలుగు ప్రజల సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని,

## బట్టల దుకాణాల్లో రహస్య కెమెరాలకు చెక్.. రంగంలోకి షీ నేత్ర టీమ్స్..




హైదరాబాద్‌లో మహిళల భద్రతే లక్ష్యంగా షీ నేత్ర టీమ్స్‌ను ఆయన ప్రారంభం

భాగ్యనగరంలో 7 జోన్లకు 7 ప్రత్యేక షీ నేత్ర టీమ్స్‌ను ఏర్పాటు

గరవ్యాప్తంగా హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు వంటి ప్రదేశాల్లో రహస్య కెమెరాలపై ఉక్కుపాదం

షీ టీమ్స్‌తో సమన్వయం కోసం నోడల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచన

హైదరాబాద్: పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాల్లో రహస్య కెమెరాలతో మహిళలను చిత్రీకరించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. అందుకోసం 'షీ నేత్ర టీమ్స్'ను రంగంలోకి దింపినట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో మహిళల భద్రతే లక్ష్యంగా షీ నేత్ర టీమ్స్‌ను ఆయన ప్రారంభించారు. భాగ్యనగరంలో 7 జోన్లకు

# అమరావతిలో క్వాంటం నవశకం..

### ఏప్రిల్ 14న దేశంలోనే తొలి టెస్ట్ ఫెసిలిటీని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

- ★ రాజధాని అమరావతికి కీలక స్థానం కల్పించే దిశగా మరో చరిత్రాత్మక అడుగు
- ★ మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన చంద్రబాబు
- ★ క్వాంటం టెక్నాలజీతో ఏపీ భవిష్యత్తుకు బలమైన పునాదులు
- ★ దేశంలో క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ కేంద్రాన్ని కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్




అమరావతి: ప్రపంచ సాంకేతిక పటంలో ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా రాజధాని అమరావతికి కీలక స్థానం కల్పించే దిశగా మరో చరిత్రాత్మక అడుగు పడుతోంది. నవశకం టెక్నాలజీ అయిన క్వాంటం కంప్యూటింగ్ రంగంలో దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన స్వదేశీ క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏప్రిల్ 14న ప్రారంభించనున్నారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఈ ఫెసిలిటీ అందుబాటులోకి రావడంతో, దేశంలో క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ కేంద్రాన్ని కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుంది. గన్నవరంలోని మేధా టవర్స్‌లో 'అమరావతి 1క్యూవ్' పేరుతో, రాజధాని పరిధిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 'అమరావతి 1ఎస్' పేరుతో రెండు అత్యాధునిక క్వాంటం టెస్ట్ బెడ్స్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ముఖ్యంగా ఎస్ఆర్ఎం వర్సిటీలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీని విద్యార్థులు, పరిశోధకుల కోసం 'ఓపెన్ యాక్సెస్' ప్రాతిపదికన అందుబాటులో ఉంచనున్నారు. దీని ద్వారా వారు క్వాంటం కంప్యూటింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించి, పరిశోధనలు చేసేందుకు వీలు కలుగుతుంది. మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన చంద్రబాబు, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీతో ఏపీ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నారు.

## వైసీపీ నేతలది గుంట నక్కల రాజకీయం - కేంద్ర మంత్రి రామ్మోహన్




శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారితమని, జిల్లా ప్రజలకు సాగునీటి భద్రత కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వంశధార నీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాను సస్యశ్యామలం చేయాలని పూనుకున్నట్లు ఆయన చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళంలో సాగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారని కేంద్ర మంత్రి మండిపడ్డారు. 2010లో వంశధార ట్రైబ్యునల్ ఏర్పాటు అయ్యిందని.. అప్పటి నుంచి నేరడి బ్యారేజ్ విషయంలో ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు ఆయన చెప్పారు.

నేరడి బ్యారేజ్ సమస్యకు చెక్..

2024లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేరడి బ్యారేజ్ సమస్యపై దృష్టి పెట్టామని ఈ సందర్భంగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వం రావటంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. వంశధార ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చుకున్నామని.. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీనిపై వైసీపీ నేతలు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అయినా తన మొదటి ప్రాధాన్యత జిల్లా అభివృద్ధికే అని రామ్మోహన్ స్పష్టం చేశారు.

## రాయలసీమ ప్రాజెక్టులపై చంద్రబాబు వివక్ష: అనంతపురం జిల్లా వైసీపీ నేతల ధ్వజం





రాయలసీమపై చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు

రాయలసీమకు దక్కాల్సిన న్యాయమైన నీటి వాటా కోసం రాజీలేని పోరాటం చేస్తాం


రాయలసీమ ప్రాంత ప్రాజెక్టుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి నుంచి చులకన భావం

## పశ్చిమబెంగాల్‌లో బీజేపీ మేనిఫెస్టో విడుదల




కోల్‌కాతా: పశ్చిమబెంగాల్‌లో మహిళలు, యువత లక్ష్యంగా బీజేపీ తన మేనిఫెస్టో విడుదల చేసింది. పలు వర్గాలను ఆకట్టుకునేలా బీజేపీ హామీలు ఇచ్చింది. ఇంటికి పెద్దగా ఉన్న మహిళకు నెలకు రూ.3 వేలు ఆర్థిక ప్రోత్సాహకం ప్రకటించింది. ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. మేనిఫెస్టోను విడుదల చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు.

## టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్... పెరిగిన కరవు భత్యం




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగుల కరవు భత్యం (డీఏ) 2.1 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా ప్రకటించారు. తాజా పెంపుతో ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయంతో సుమారు

## బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి..

# తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని వ్యాఖ్య

- ★ భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు
- ★ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- ★ సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్




హైదరాబాద్: తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని

# సీడబ్ల్యూసీలో పార్లమెంటు వ్యూహాలపై అగ్ర నేతల చర్చ

- ▶▶ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం
- ▶▶ సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు
- ▶▶ మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం
- ▶▶ ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చ
- ▶▶ జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం




ఢిల్లీ,: దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభమైంది. జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈ సమావేశంలో సమాలోచనలు చేసింది. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సల్మాన్‌ఖుర్షీద్,అంబికాసోనీ,సచిన్ పైలట్, భూపేశ్, బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు.

## ఢిల్లీ రాజకీయాల్లోకి నితీశ్ కుమార్.. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం




మార్చి 16న రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన నితీశ్,

1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితీశ్..

తాజా పరిణామంతో బీహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలు

## గుంపు మేస్త్రీ అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు



## ఢిల్లీ రాజకీయాల్లోకి నితీశ్ కుమార్..
# రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం

ఢిల్లీ: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు తీసుకున్నారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ పరిణామంతో ఆయన ఇక జాతీయ రాజకీయాలకే పరిమితం కానున్నట్లు స్పష్టమైంది. త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు నితీశ్ స్వయంగా వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకారంతో నితీశ్ కుమార్ తన ఖాతాలో ఓ అరుదైన ఘనతను చేర్చుకున్నారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ.. ఇలా నాలుగు చట్టసభల్లోనూ సభ్యుడిగా పనిచేసిన కొద్దిమంది నేతల జాబితాలో ఆయన చేరారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ఆయన గురువారమే ఢిల్లీకి చేరుకున్నారు. మార్చి 16న రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన నితీశ్, మార్చి 30న తన శాసనమండలి సభ్యత్వానికి (ఎమ్మెల్సీ) రాజీనామా చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఆయన ముఖ్యమంత్రి పదవి నుంచి కూడా తప్పుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా ఢిల్లీలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. "బీహార్‌లో చాలా పనులు చేశాను. ఇక ఇక్కడే (ఢిల్లీ) ఉండి సేవ చేయాలని భావిస్తున్నాను. మూడు నాలుగు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తాను. కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతలు చేపడతారు" అని స్పష్టం చేశారు. 2005 నవంబర్‌లో ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నితీశ్ కుమార్ అసెంబ్లీకి పోటీ చేయకుండా, శాసనమండలి సభ్యుడిగానే కొనసాగుతున్నారు. 2006 నుంచి వరుసగా నాలుగుసార్లు ఆయన ఎమ్మెల్సీగా పనిచేశారు. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితీశ్, ఆ తర్వాత లోక్‌సభ ఎంపీగా కూడా సేవలందించారు. తాజా పరిణామంతో బీహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలుకానున్నాయి.

## పశ్చిమబెంగాల్‌లో బీజేపీ మేనిఫెస్టో విడుదల

మొదటి పేజి తరువాయి

మేనిఫెస్టోను విడుదల చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. 15 ఏళ్ల మమతా బెనర్జీ పాలనపై ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారన్నా అమిత్ షా.. బెంగాల్‌లో చీకటి పాలన ముగుస్తుందన్నారు. వికసిత్ బెంగాల్ రోడ్‌మ్యాప్‌ను మేనిఫెస్టోలో పెట్టాం. పేదలకు ఆయుష్మాన్ భారత్ స్కీమ్ అమలు చేస్తామన్న అమిత్ షా.. రైతుల సంక్షేమం, యువత ఉపాధి అవకాశాలపై కీలక హామీలు ఇచ్చారు. మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చాక బెంగాల్‌లో యూసీసీ అమలు చేస్తామని తెలిపారు. భయం లేని బెంగాల్.. పునర్నిర్మాణమే తమ లక్ష్యం అన్న అమిత్ షా.. బీజేపీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చొరబాటుదారుల ఏరివేత.. 7వ పే కమిషన్ అమలు చేస్తామని తెలిపారు. "ఆరు నెలల్లో ఉమ్మడి పౌరస్మృతి అమలు. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు డిఏ చెల్లిపులు. మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్. రాజకీయ హింస కేసులపై ముమ్మర దర్యాప్తు. బంగ్లాదేశ్ సరిహద్దులో ఫెన్సింగ్ కోసం భూముల కేటాయింపు. ఆవుల స్మగ్లింగ్ నిలిపివేస్తాం. దుర్గా సురక్ష స్క్వాడ్ ఏర్పాటు" చేస్తామని అమిత్ షా తెలిపారు.

## టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్... పెరిగిన కరవు భత్యం

మొదటి పేజి తరువాయి

తాజా పెంపుతో ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయంతో సుమారు 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. డీఏ పెంపు నిర్ణయం 2026 జనవరి నుంచే అమల్లోకి వస్తుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల బకాయిలను రాబోయే నెలల్లో సప్లిమెంటరీ బిల్లుల ద్వారా విడతలవారీగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ డీఏ పెంపు వల్ల ఆర్టీసీపై ప్రతి నెలా అదనంగా రూ.2.82 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు ఏటా జనవరి, జులై నెలల్లో డీఏను సవరిస్తారు. గత ఏడాది జులైలో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 2.1 శాతం డీఏ పెంచింది. తాజాగా మరోసారి డీఏను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీకి ఆర్థికంగా ఊతమిస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి, సంస్థ ఆదాయం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నాటికి ఆర్టీసీ సుమారు రూ.954 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించింది. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తుండటంతో సంస్థ కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో కొత్త బస్సులను కొనుగోలు చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా లాభాలను మరింత పెంచుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది.

## బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి..
### - తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని వ్యాఖ్య

హైదరాబాద్: తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12,000 అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామని, పండించిన సన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా రేషన్ ద్వారా రాష్ట్రంలోని పేదలకు అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్ దత్ మరియు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుంపు మేస్త్రీ అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా
# - కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు

హైదరాబాద్: హైదరాబాద్ నగరాభివృద్ధి ముసుగులో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆమె, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను విక్రయానికి పెట్టారని, అయితే ఆ నిధులను నగర అభివృద్ధికి వెచ్చించకుండా దారి మళ్లిస్తున్నారని ఆమె ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా స్వయంగా ముఖ్యమంత్రే ఉన్నారని గుర్తు చేస్తూ, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఆయన అనుచరుల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. ముఖ్యంగా టెండర్ల ప్రక్రియలో నిబంధనలను తుంగలో తొక్కారని కవిత ఆరోపించారు. గతంలో నామినేషన్ పద్ధతిలో జరిగిన పనుల కంటే, రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సుమారు 1,140 కోట్ల రూపాయల కాంట్రాక్టులను అదే పద్ధతిలో అప్పగించారని, ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. పారదర్శకమైన టెండర్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండికొట్టి, కేవలం అవినీతి కోసమే 'ఫ్యూచర్ సిటీ' పేరుతో సరికొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. జీహెచ్ఎంసీ పాలన ప్రస్తుతం 'గుంపు మేస్త్రి' చేతుల్లో చిక్కి మహా అవినీతికి నిలయంగా మారిందని ఆమె వ్యాఖ్యానించారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో గతంలో సిట్ వేయించిన ముఖ్యమంత్రి, ఇప్పుడు అదే కాంట్రాక్టును ఎలా కొనసాగిస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

## బట్టల దుకాణాల్లో రహస్య కెమెరాలకు చెక్..
# రంగంలోకి షీ నేత్ర టీమ్స్..

మొదటి పేజి తరువాయి



హైదరాబాద్‌లో మహిళల భద్రతే లక్ష్యంగా షీ నేత్ర టీమ్స్‌ను ఆయన ప్రారంభించారు. భాగ్యనగరంలో 7 జోన్లకు 7 ప్రత్యేక షీ నేత్ర టీమ్స్‌ను ఏర్పాటు చేశారు సీపీ సజ్జనార్. ఆయన తన చేతుల మీదుగా ఆయా బృందాలకు కెమెరా డిటెక్టర్ల అందజేశారు. మహిళల ఆత్మగౌరవం, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే రహస్య కెమెరాల గుట్టును ఈ బృందాలు రట్టు చేయనున్నాయి. నగరవ్యాప్తంగా హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు వంటి ప్రదేశాల్లో రహస్య కెమెరాలపై ఉక్కుపాదం మోపనున్నాయి. ముఖ్యంగా బట్టల దుకాణాల్లోని ట్రయల్ రూమ్స్, ప్రైవేట్ ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీలు చేయనున్నారు. ఇకపై అత్యాధునిక కెమెరా డిటెక్టర్లతో ఆకస్మిక సోదాలు నిర్వహించనున్నారు. ఈ బృందాల ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడిన సీపీ సజ్జనార్.. బట్టల దుకాణాలు, హోటళ్లు, హాస్టళ్లు, మాల్స్ వంటి ప్రాంతాల్లో ఆడవారి భద్రత ఆయా సంస్థల యాజమాన్యాలదే అని తేల్చిచెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే సంస్థలు, సిబ్బందిని బ్లాక్‌లిస్టులో పెట్టే విధంగా చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రతి సంస్థలో కస్టమర్ సేఫ్టీ ఇన్‌ఛార్జ్ నియామకం తప్పనిసరని ఆదేశాలిచ్చారు. షీ టీమ్స్‌తో సమన్వయం కోసం నోడల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ చెప్పారు.

## మహిళా రిజర్వేషన్లపై బీజేపీ 'మాస్టర్ ప్లాన్'.. పార్లమెంటు బిల్లుకు ముందే దేశవ్యాప్త ప్రచారం!

మొదటి పేజి తరువాయి

2029 ఎన్నికల నుంచే చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా చట్టంలో అవసరమైన సవరణలు తీసుకువచ్చేందుకు రంగం సిద్ధమైంది.

పలు రాష్ట్రాల అధ్యక్షులతో నితిన్ నబీన్ కీలక భేటీ..

మహిళ బిల్లుపై దేశవ్యాప్త అవగాహన కల్పించేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగానే ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో పలు రాష్ట్రాల అధ్యక్షులతో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావుతో పాటు ఇరు రాష్ట్రాల ఇన్‌చార్జ్ కార్యదర్శులు హాజరయ్యారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడానికి ఉన్న ఈ ఐదు రోజుల్లో పలు రాష్ట్రాల వ్యాప్తంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలు..

ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ప్రత్యేక




సమావేశాల్లో మహిళ బిల్లు చర్చకు రానుంది. మూడు రోజుల్లోనే వీటికి ఆమోద ముద్ర వేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మహిళా రిజర్వేషన్లను 2029 సాధారణ ఎన్నికల నుంచి అమల్లోకి తీసుకురావాలని మోదీ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనివల్ల చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలుకు, నియోజకవర్గాల పునర్విభజనకు బీజేపీ సర్కార్ సిద్ధమవుతోంది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యను 50 శాతం వరకు పెంచాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ విషయంపై ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్ని పార్టీలతో సంప్రదింపులు జరిపారు.

మహిళా రిజర్వేషన్లపై భిన్నాభిప్రాయాలు..

మహిళా రిజర్వేషన్లకు అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్నప్పటికీ, అమలు చేసే విధానంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విపక్ష పార్టీలు 2011 గణాంకాల కంటే, 2026 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. నియోజకవర్గాల సంఖ్య పెంచడం వల్ల దక్షిణ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనల నేపథ్యంలో 2026 లెక్కల ప్రాధాన్యతను విపక్షాలు నొక్కి చెబుతున్నాయి. పార్లమెంటులో మహిళ బిల్లు ఆమోదం పొందిన తర్వాత దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీలు నిర్వహించి, మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకోవాలని బీజేపీ భావిస్తోంది. 2029 ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చే ఈ చట్ట సవరణ బిల్లు భారత ప్రజాస్వామ్యంలో ఒక మైలురాయిగా నిలవనుంది. ఈ కీలక బిల్లుపై పార్లమెంటులో ఎలాంటి చర్చ జరుగుతుందోనని దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# అమరావతిలో క్వాంటం నవశకం..
## ఏప్రిల్ 14న దేశంలోనే తొలి టెస్ట్ ఫెసిలిటీని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన చంద్రబాబు, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీతో ఏపీ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నారు.

హార్డ్‌వేర్ తయారీకి కేంద్రంగా అమరావతి

కేవలం సాఫ్ట్‌వేర్ అల్గారిథమ్స్‌కే పరిమితం కాకుండా క్వాంటం కంప్యూటర్ల హార్డ్‌వేర్ తయారీలోనూ స్వయం సమృద్ధి సాధించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం. ఈ ఆశయ సాధనలో భాగంగానే అమరావతిలో ఈ టెస్టింగ్ ఫెసిలిటీలను ఏర్పాటు చేశారు. మైనస్ 273 డిగ్రీల సెల్సియస్ అత్యంత శీతల ఉష్ణోగ్రత వద్ద పనిచేసే ఈ కేంద్రాల్లో, క్వాంటం కంప్యూటర్లకు అవసరమైన పరికరాలను పరీక్షించి, సర్టిఫికేషన్ ఇస్తారు. ఇటీవలే 30కి పైగా క్వాంటం హార్డ్‌వేర్ తయారీ సంస్థలతో సీఎం సమావేశమై, అమరావతిని దేశ క్వాంటం హార్డ్‌వేర్ నెట్‌వర్క్‌కు యాంకర్ నోడ్‌గా తీర్చిదిద్దాలని



నిర్దేశించారు. క్రయోజెనిక్స్, ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో స్వదేశీ ఉపకరణాల తయారీకి ఈ కేంద్రం ఊతమివ్వనుంది.

గ్లోబల్ హబ్‌గా క్వాంటం వ్యాలీ

అమరావతిని ప్రపంచంలోని మొదటి 5 క్వాంటం హబ్‌లలో ఒకటిగా నిలపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దండరాయునిపాలెంలో 50 ఎకరాల్లో 'అమరావతి క్వాంటం వ్యాలీ'ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇందులో భాగంగా అంతర్జాతీయ టెక్ దిగ్గజం ఐబీఎం భాగస్వామ్యంతో 133 క్యూబిట్ సామర్థ్యమున్న శక్తివంతమైన క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానుంది. టీసీఎస్, ఎల్ అండ్ టీ, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వంటి సంస్థలు ఈ ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్నాయి. నూతన ఔషధాల ఆవిష్కరణ, వాతావరణ అంచనాలు, సెమీ కండక్టర్ల డిజైన్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో కీలక పరిశోధనలకు ఈ కేంద్రం వేదిక కానుంది. ఇప్పటికే 80కి పైగా అంతర్జాతీయ సంస్థలు, వర్సిటీలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. క్వాంటం నైపుణ్యాల కల్పనలో భాగంగా ఐదేళ్లలో 45 లక్షల మంది నిపుణులను తయారు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

# సీడబ్ల్యూసీలో పార్లమెంటు వ్యూహాలపై అగ్ర నేతల చర్చ

మొదటి పేజి తరువాయి

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు.

చర్చకు రానున్న ప్రధాన అంశాలు..

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది.

మహిళా రిజర్వేషన్ బిల్లు: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు.

నియోజకవర్గాల పునర్విభజన: 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు.

పశ్చిమాసియా సంక్షోభం: అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు.




పార్లమెంటు వ్యూహం: కేవలం మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు.

రాజకీయ ప్రాధాన్యం

రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రత్యేక సమావేశాలను పిలవడంతో ఈ జబెజ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ బలోపేతంపై సీఎం రేవంత్‌రెడ్డి సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక ప్రసంగం చేసే అవకాశం ఉంది.

ఎన్నికల ప్రయోజనాల కోసమే పార్లమెంట్ సమావేశాలు: మల్లికార్జున ఖర్గే

సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టతని ఇచ్చామని, కేంద్రాన్ని డిమాండ్ కూడా చేశామని ప్రస్తావించారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ హఠాత్తుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు సవరణ , పునర్విభజన చట్టం సవరణ బిల్లులను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక అఖిలపక్ష సమావేశం పెట్టాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలన్నీ కోరాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం ప్రయత్నం చేస్తుందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

## వైసీపీ నేతలది గుంట నక్కల రాజకీయం - కేంద్ర మంత్రి రామ్మోహన్

మొదటి పేజి తరువాయి

శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్..

త్వరలో నేరడి బ్యారేజ్ పనులు ప్రారంభమవుతాయని.. రైల్వే జోన్ సాధించుకోవటం మరో విజయమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలోని ఏడు రైల్వేస్టేషన్లను కొత్త రైల్వే జోన్‌లో పెట్టించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తిరుపతి వెళ్లే భక్తుల కోసం హంసఫర్ ఎక్స్‌ప్రెస్ ఇకపై శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుందంటూ ఆయన గుడ్ న్యూస్ చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశామని.. పొందూరు ఖాదీకి జియో ట్యాగ్ సాధించామనీ వెల్లడించారు. కేంద్రం నుంచి జిల్లాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తున్నానని రామ్మోహన్ పేర్కొన్నారు.


అభివృద్ధిని వైసీపీ జీర్ణించుకోలేదు..!

జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆగ్రహించారు. ప్రజల కోసం పని చేసే నేతలైతే కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేసిన పనులను అభినందించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అమరావతి బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చిందని.. జగన్ పార్టీ మాత్రం బిల్లు సందర్భంగా పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందని మండిపడ్డారు. అమరావతి చట్టబద్ధత కోసం సీఎం చంద్రబాబు నాయుడు చాలా కృషి చేశారని చెప్పుకొచ్చారు. రాజధానిగా అమరావతికి రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా సంపూర్ణ మద్దతు ఇచ్చారని చెప్పుకొచ్చారు.

వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదు..

అధికారంలో ఉన్నప్పుడు రాజధానిపై జగన్ మూడు ముక్కలాట ఆడారని.. ఇప్పుడూ అదే డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. అమరావతి పూర్తయితే చంద్రబాబు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న భయం వైసీపీదని ఆరోపించారు. జాతీయస్థాయిలో చంద్రబాబుది ఓ ప్రత్యేక గుర్తింపని కొనియాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనేది వైసీపీ అజెండా అయితే.. చంద్రబాబుది అభివృద్ధి అజెండా అని పేర్కొన్నారు. ప్రజలు ఛీ కొట్టినా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని.. చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయమంటూ నిప్పులు చెరిగారు. విశాఖ రాజధాని పేరుతో వైసీపీ నేతలు భూదందా చేశారని ఆరోపించారు రామ్మోహన్ నాయుడు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పూర్తవుతాయని.. కేంద్రం సహకారంతో రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఒక పక్క అభివృద్ధి జరుగుతుంటే మరో పక్క వైసీపీ నేతలు గుంట నక్క రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ఆగ్రహించారు.

## రాయలసీమ ప్రాజెక్టులపై చంద్రబాబు వివక్ష: అనంతపురం జిల్లా వైసీపీ నేతల ధ్వజం



అనంతపురం: చంద్రబాబుకి రైతుల కష్టాలు పట్టవని.. రాయలసీమ అంటే మొదటి నుంచి ఆయనకు చులకనేనని వైఎస్సార్‌సీపీ నేతలు అంటున్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సాధన కోసం వైఎస్సార్‌సీపీ పోరును ఉధృతం చేసింది. ఈ క్రమంలో శుక్రవారం అనంతపురంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు అర్ధాంతరంగా నిలిపివేయడం వెనుక పెద్ద కుట్ర ఉంది. తాను చెబితేనే చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు ఆపేశారని తెలంగాణ సీఎం రేవంత్ అంటున్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు స్పందించలేదు. రాయలసీమ అంటే చంద్రబాబు కు ఎందుకు చులకన?. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సీమ ప్రాజెక్టులకు ఇన్సూరెన్స్ వంటిది మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ.. తెలంగాణకు మేం వ్యతిరేకం కాదు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు నిలిపివేయడం దుర్మార్గం. ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరి అనుమానాస్పదంగా ఉంది. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తయితేనే తెలంగాణ మాదిరి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 800 అడుగుల్లో నీరు తీసుకోవచ్చు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 854 అడుగుల్లో నీరు తరలించటం అసాధ్యం. నీటి వాటాలు ఖచ్చితంగా తీసుకొచ్చేందుకే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. రాయలసీమ పై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష సాధింపు తో వ్యవహరిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారు?. సీఎం రేవంత్ కోరితే... రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆపేస్తారా??. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు దొంగ ప్రాజెక్టు అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అంటున్నారు. దొంగ ప్రాజెక్టు అయితే మీరెందుకు వెయ్యి కోట్ల రూపాయల బిల్లులు విడుదల చేశారో పయ్యావుల కేశవ్ చెప్పాలి. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తయితేనే సీమ ప్రాజెక్టు లకు నీరు అందుతుంది. చంద్రబాబు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలి. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ సాగు తాగు నీటి కష్టాలు తీర్చిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డిదే. అదే స్ఫూర్తి ని కొనసాగించేందుకే వైఎస్ జగన్ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు చేపట్టారు. రాయలసీమకు అడుగడుగునా అన్యాయం చేసిన ఘనుడు చంద్రబాబు. హైకోర్టు, ఎయిమ్స్, ఇతర ప్రాజెక్టులను ఇతర ప్రాంతానికి తరలించారు. రాయలసీమ అభివృద్ధి పై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు చిత్తశుద్ధి ఏది?. సీమ వాసులు టీడీపీ కూటమికే పట్టం కడితే... మీరు చేస్తున్నది ఏమిటి?. సీఎం రేవంత్ రెడ్డి చెప్పేదాకా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని చాలా మందికి తెలియదు. టీడీపీ కూటమి కి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉంది ఈ సమావేశంలో.. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై. వెంకట్రామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు తెలుగు యువశక్తి కీలక నిర్ణయం

మొదటి పేజి తరువాయి

ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా తమిళనాడులో తెలుగు ప్రజల సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, తాను తాళి నియోజకవర్గం నుండి పోటీ చేయకుండా.. ప్రజా ప్రయోజనాల కోసం, సమాన హక్కుల కోసం మరింత బలంగా పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. "తమిళనాడులో సుమారు 70--80 లక్షల తెలుగు ప్రజలు నివసిస్తున్నారు. ముఖ్యంగా ఈ జిల్లాల్లో అధిక ప్రభావం ఉంది. చెన్నై, తిరువల్లూర్, కాంచీపురం, తిరువన్నామలై, వెల్లూర్, కృష్ణగిరి, సేలం, ఈరోడ్, కోయంబత్తూర్, మధురై, తిరుచ్చి, తంజావూరు, చెంగల్పట్టు ఈ ప్రాంతాలు అనేక నియోజకవర్గాల్లో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే శక్తిగా ఉన్నాయి...సీఎం స్టాలిన్ నాయకత్వంలో తెలుగు సంతతికి చెందిన నాయకులకు గౌరవప్రదమైన స్థానం లభించింది. సుమారు నలుగురు తెలుగు మంత్రులు మంత్రివర్గంలో ఉన్నారు. దాదాపు 20--25 మంది ఎమ్మెల్యేలు తెలుగు ప్రజలను ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇది తెలుగు ప్రజలకు సమాన అవకాశాలు, గౌరవం కల్పించే సమగ్ర



పాలనకు నిదర్శనం"అని కేతిరెడ్డి పేర్కొన్నారు. సినీ నటి కస్తూరి... తెలుగు ప్రజలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమయంలో, తమిళనాడు ప్రభుత్వం తక్షణమే స్పందించి.. తెలుగు ప్రజల గౌరవాన్ని కాపాడే విధంగా చర్యలు తీసుకుంది. ఈ సంఘటన ద్వారా తెలుగు ప్రజల గౌరవం, స్వాభిమానం కాపాడటంలో ప్రస్తుత ప్రభుత్వం ఎంత కట్టుబడి ఉందో స్పష్టమవుతుంది. తమిళనాడు తెలుగు యువశక్తి.. రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తుంది. తెలుగు ఓటర్లను ఏకతాటిపైకి తీసుకువస్తుంది. డీఎంకే, ఆ పార్టీ కూటమి అభ్యర్థుల విజయానికి కట్టుబడి పనిచేస్తుంది. తమిళనాడులో తెలుగు ప్రజల భద్రత, గౌరవం, ప్రాతినిధ్యం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ప్రభుత్వం డీఎంకే మాత్రమే. ఈ ఎన్నికల్లో డీఎంకే విజయం ఖాయం" అని కేతిరెడ్డి పేర్కొన్నారు.

## బీసీవై పార్టీ ఆధ్వర్యంలో మూడోరోజు నిరాహారదీక్షలు

### -ఐదు డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలి

మంగళగిరి, ఏప్రిల్ 10 (అజయ్ నారగాని – నేటి శుభోదయ ) బీసీవై పార్టీ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి బీసీల న్యాయమైన ఐదు డిమాండ్లు సాధనకై రిలే నిరాహార దీక్ష మంగళగిరిలోని అంబేద్కరి విగ్రహం వద్ద నిర్వహించారు. బీసీ ల ఐదు ప్రధాన డిమాండ్లైన సమగ్ర కులగణన , బీసీలకు రక్షణ చట్టం, బీసీ కులాలు కార్పొరేషన్లకు నిధులు కేటాయించడం, విద్యా ఉద్యోగాలలో, చట్టసభల్లో ,బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు, రాజధాని ప్రాంతంలో బీసీలకు 1000 ఎకరాలు కేటాయించాలి మొదలైన డిమాండ్ల తోశు క్రవారం మంగళగిరి నియోజకవర్గంలోని భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష మూడో రోజు కొనసాగింది. బీసీల ఐదు డిమాండ్లు పైనాతెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని బీసీవై పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నవారు మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్, తోట శివరాం ప్రసాద్ యాదవ్ , బోయిన బిక్షం యాదవ్, గుడివాడ యూత్ కన్వీనర్,రాష్ట్ర మహిళా కో కన్వీనర్ స్వాతి గౌడ్,మంగళగిరి నియోజకవర్గ యూత్ కన్వీనర్, ఆదిన సతీష్ యాదవ్, రాష్ట్ర మహిళా కో కన్వీనర్ నీలిమ యాదవ్,జిల్లా యూత్ కన్వీనర్, బత్తుల నాగరాజు,ప్రతిపాడు నియోజకవర్గ కన్వీనర్, బాబి యాదవ్ పారుపుడి యూత్ కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జంక్షన్‌లో వినాయక విగ్రహ ప్రతిష్ట, వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు



హనుమాన్ జంక్షన్, ఏప్రిల్ 10 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ ) గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌లో శుక్రవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆయన సతీమణి జ్ఞానేశ్వరి తో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమాన్ జంక్షన్‌లో శ్రీ వరసిద్ధి వినాయక గణపతి దేవాలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వరసిద్ధి గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు. అనంతరం హనుమాన్ జంక్షన్ నూజివీడు రోడ్డులోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లిన ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో నిన్నటి నుండి ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల రెండో రోజైన నేడు ఉదయం 6 గంటల నుంచే సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం చతుస్థానార్చనలు, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారికి శ్రీ సూక్త హోమం నిర్వహించగా, మహిళల ఆధ్వర్యంలో సామూహిక సహస్ర కుంకుమార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. సాయంత్రం దైవిక రాయబారోత్సవం, మంగళాశాసనం వంటి విశేష పూజలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో అట్లూరి శ్రీనివాసరావు, చలమలశెట్టి రమేష్, మూల్పూరి సాయి కళ్యాణి, ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, వడ్డిల్లి లక్ష్మీ, చింతల వెంకట అప్పారావు, మొవ్వ వేణుగోపాల్, చలసాని శ్రీనివాసరావు, యలమంచిలి మూర్తి, నందిగం స్వామి, ఎస్. కే సాంబశివరావు, తవ్వా పూర్ణచంద్రరావు, దుట్టా శివన్నారాయణ, అరుమళ్ళ కృష్ణారెడ్డి, తాడిశెట్టి శ్రీను, కడవకొల్లు రాజేష్, అవిర్నేని భవాని శంకర్, కొల్లూరు చంద్రకాంత్, వలివేటి కిషోర్, లింగం శ్రీధర్, ఆర్నేపల్లి సూరిబాబు, గరికపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పన్ను చెల్లింపు దారులకు పురపాలక సంఘం

## పర్యావరణ ప్రోత్సాహక చర్యలు




గుడివాడ, ఏప్రిల్ 10 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ) గుడివాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో సమయానికి పన్నులు చెల్లించిన పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించేందుకు ఎవరైతే ముందస్తు పన్ను చెల్లించారో వారికి ఎమ్మెల్యే రాము చే క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు పన్నులు చెల్లించడంతోపాటు పర్యావరణాన్ని కాపాడడంలా భాగంగా సింగల్ యుజ్ ప్లాస్టిక్ నిషేధించి క్లాత్ బ్యాగులను వాడకాన్ని ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమం ప్రవేశ పెట్టడం జరిగింది.ఈ కార్యక్రమానికి గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, పురపాలక కమిషనర్ ఎస్. మనోహర్ లు హాజరై, పన్నులు చెల్లించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు నగర అభివృద్ధికి ముఖ్య భాగస్వాములని పేర్కొన్నారు.

## ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షిస్తాం

### -కడప జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత



అమరావతి, ఏప్రిల్ 10 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ ) కడప జిల్లా ఖాజీపేటలో విద్యార్థిని బలిగొన్న ప్రేమోన్మాది ఘాతుకంపై జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఎంతో భవిష్యత్తు కలిగిన యువతి హత్యకు గురికావడం మనస్సును కలిచి వేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. నిందితుడు ఎంతటివాడైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై పట్ల ఉన్మాదిలా వ్యవహరిస్తే ఉక్కుపాదంతో అణిచివేస్తామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఇన్చార్జి మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. పెళ్లి చేసుకోవాలంటూ, యువతి ఇంటికి వెళ్లి గొంతు కోయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విచక్షణ మరిచి, ఎంతో భవిష్యత్తు కలిగిన యువతిని బలి కొనడం దారుణమన్నారు. నిందితుడు శ్రీనివాస్ క్షమించరాని నేరం చేశాడన్నారు. ప్రేమోన్మాదికి చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. యువతి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేసిన మంత్రి సవిత, అండగా ఉంటామన్నారు. భవిష్యత్తులో మరెవరూ మహిళలు, బాలికల వైపు కన్నెత్తు చూడకుండా ఉండేలా చట్టపరంగా నిందితుడిని శిక్షిస్తామన్నారు. మహిళల పట్ల సైకోల్లా ప్రవర్తిస్తే వారికి అదే చివరి రోజని హెచ్చరించారు. యువత బాధ్యతతో మెలుగుతూ, డ్రగ్స్ కు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మగ బిడ్డల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పుడూ వారిపై ఓ కన్నేసి ఉంచాలని అన్నారు. నైతిక విలువలతో కూడిన జీవనం సాగించేలా చూడాలని మంత్రి సవిత సూచించారు.


### శ్రీ కనక దుర్గమ్మ వారిని దర్శించుకున్న

## ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విజయవాడలోని శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ ్ూజూ అమ్మవారి తీర్థ ప్రసాదాలను, శేష వస్త్రాన్ని బహూకరించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

## రాయవారిపల్లి గ్రామపంచాయతీ నిధుల ఖర్చులపై విచారణ



పులిచెర్ల, ఏప్రిల్ 10,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం రాయవారి పల్లి గ్రామపంచాయతీ నిధుల ఖర్చులపై శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో చిత్తూరు డివిజన్ పంచాయతీ అభివృద్ధి అధికారి రవికుమార్ విచారణ చేపట్టారు. గ్రామపంచాయతీ నిధులు ఖర్చులపై. ఫిర్యాదులు రావడంతో. వాస్తవ విషయాల కోసం. డి డి వో రవికుమార్ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని మాజీ సర్పంచ్ మునిరత్నం ఫిర్యాదుదారులతో వేరువేరుగా మాట్లాడి రికార్డులను నమోదు చేశారు. తొలుత మాజీ సర్పంచ్ మునిరత్నం నిధులు ఖర్చులపై వివరణ అడిగారు

**మాజీ సర్పంచ్ మునిరత్నం ఏమి చెప్పారంటే...**




సార్ పంచాయతీలో మంచి నీటి బోర్లు మరమ్మత్తులు, పారిశుధ్య చర్యలు మౌలిక వసతుల కోసం నిధులు ఖర్చు పెట్టాను వివరాలు అన్నీ ఉన్నాయి ఎం బుక్ రికార్డు వద్ద ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన ఎం బుక్ రికార్డు చేయడం లేదు. ఖర్చుపెట్టిన దానికి డబ్బులు తీసుకున్నాను అంతే సార్ అంటూ వివరణ ఇవ్వడంతో అదే ప్రకారం రికార్డు నమోదు చేశారు

**తర్వాత ఫిర్యాదుదారులు పిలిపించి వివరణ అడిగారు ఫిర్యాదుదారు లు ఏమి చెప్పారంటే..**

సార్ పంచాయతీలో నిధులు ఖర్చు పెట్టారు ఇందుకు సంబంధించిన రికార్డులు లేవు మీరు చర్యలు చేపట్టాలి అంటూ చెప్పడంతో...ఆ మేరకు రికార్డు చేశారు ఇలా డిడిఓ రవికుమార్ మాజీ సర్పంచ్ ఫిర్యాదు దారుల దగ్గర నుంచి వివరణ తీసుకొని రికార్డు చేశారు.మాజీ సర్పంచ్ మునిరత్నం వివరణ ఇచ్చిన సమయంలో అక్కడ డిప్యూటీ ఎంపీడీవో హరికుమార్, పంచాయతీ అభివృద్ధి అధికారి దినేష్ ఉన్నారు. డిడిఓ రవికుమార్ మాజీ సర్పంచ్ చెప్పిన చేసిన పనుల గురించి పంచాయతీ అభివృద్ధి అధికారి దినేష్ ను అడగగా పనులు. చేశారంటూ చెప్పడం జరిగింది. చివరలో

**డిడిఓ రవికుమార్ ఏం చెప్పారంటే...**

పంచాయతీ నిధుల ఖర్చులపై అటు మాజీ సర్పంచ్ ఇటు ఫిర్యాదు దారుల నుంచి వివరణ తీసుకుని రికార్డు నమోదు చేశాము. వివరాలను పై అధికారులకు పంపుతాము. పై అధికారుల సూచనలు మేరకు తదుపరి చర్యలు ఉంటాయని అన్నారు.

## సెల్ఫీ మోజు, ముగ్గురు బాలికల జలసమాధి

- ఫోటో కోసం ప్రాణాల పణం
- మలంగుమ్మి జలపాతంలో విషాదం

విశాఖపట్నం, అల్లూరి జిల్లా, నేటి శుభోదయ ::: విహారయాత్రలో అజాగ్రత్త ముగ్గురు నిండు ప్రాణాలను బలితీసుకుంది. సరదాగా గడపాలని వెళ్లిన ఆ స్నేహితులకు అదే చివరి రోజవుతుందని ఎవరూ ఊహించలేదు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం మలంగుమ్మి జలపాతం సాక్షిగా ముగ్గురు బాలికలు నీటి ప్రవాహంలో గాలిలో కలిసిపోయారు.సెల్ఫీలు దిగాలనే ఆరాటంతో జలపాతం అంచులకు వెళ్లిన త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16) నీటి లోతును అంచనా వేయలేక పోయారు. నాచు పట్టిన రాళ్లపై కాలు జారడంతో ఒక్కసారిగా ప్రవాహంలో పడిపోయారు. తోటి స్నేహితులు కాపాడాలని ప్రయత్నించినా, కాలం కనికరించలేదు. కళ్ల ముందే ముగ్గురు స్నేహితులు జలసమాధి కావడం అక్కడి వారిని దిగ్భ్రాంతికి గురిచేసింది.

**హెచ్చరిక**

**విహారం, విషాదం కాకూడదంటే**

నీటి వనరులు, కొండలు, కోనల వద్ద విహారానికి వెళ్లే పర్యాటకులు ఈ క్రింది విషయాలను తప్పక గుర్తుంచుకోవాలి:

- లోతును తక్కువ అంచనా వేయకండి

జలపాతాల వద్ద నీరు పైకి ప్రశాంతంగా ఉన్నా, లోపల



సుడిగుండాలు మరియు బురద గుంతలు ఉండే అవకాశం ఉంది.

**- సెల్ఫీ పిచ్చి ప్రాణాంతకం**

అంచులకు వెళ్లి ఫోటోలు దిగడం, రీల్స్ చేయడం వంటివి ప్రాణాల మీదకు తెస్తాయి. మీ ఫోటో కంటే మీ ప్రాణం ముఖ్యం.

**- స్థానిక హెచ్చరికలు పాటించండి**

ప్రమాదకరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన బోర్డులను నిర్లక్ష్యం చేయవద్దు. తెలియని ప్రదేశాల్లో నీటిలోకి దిగవద్దు.

**- పిల్లలపై తల్లిదండ్రుల నిఘా అవసరం**

పిల్లలు గ్రూపులుగా బయటకు వెళ్లేటప్పుడు వారికి తగిన జాగ్రత్తలు చెప్పి పంపండి. సాధ్యమైనంత వరకు పెద్దలు వెంట ఉండటం శ్రేయస్కరం.

**- ఒక్క క్షణం అజాగ్రత్త, మీ కుటుంబానికి తీరని శోకం**

ప్రకృతిని ఆస్వాదించండి, కానీ దానికి బలి కావద్దు. మలంగుమ్మి ఘటన మనందరికీ ఒక గుణపాఠం కావాలి. చనిపోయిన ఆ చిన్నారుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, ఇలాంటి ప్రమాదాలు మళ్ళీ జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిద్దాం.

: నెల్లూరు రూరల్ శాసనసభ్యులు గౌ శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారు మరియు రాష్ట్ర నాయకులు గౌ శ్రీ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి గారు స్ఫూర్తితో 28వ డివిజన్లోని పోస్టల్ కాలనీలో 9వ రోజు "మన కార్పొరేటర్– మన ఇంటికి" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి దగ్గరికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న డివిజన్ కార్పొరేటర్

## ఆడిటోరియం నిర్మాణంపై అధికారులతో ఎమ్మెల్యే బోండా ఉమా సమీక్ష

**-రు.95 కోట్లతో అత్యాధునిక కన్వెన్షన్ సెంటర్, 1500 మంది సామర్థ్యంతో నిర్మాణం**

**-ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు**

**అన్ని ఆధునిక సదుపాయాలతో ఆడిటోరియం, కళాకారులు, సమావేశాలకు అనువైన వేదిక, త్వరలో ప్రజల వినియోగంలోకి కన్వెన్షన్ సెంటర్**

**-సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి యత్నం, విజయవాడకు ప్రతిష్టాత్మక వేదికగా అవతరణ**



విజయవాడ, ఏప్రిల్ 10,( అజయ్ నారగాని – నేటి శుభోదయ) పిడబ్ల్యుడి గ్రౌండ్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనం పక్కన ఉన్న ఆడిటోరియం కన్స్ట్రక్షన్ ఏజెన్సీ కెపిసి ప్రాజెక్ట్ లిమిటెడ్ కంపెనీ నిర్మించిన పనులను సంబంధిత అధికారులతో కలిసి ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ నూతన రాజధాని అమరావతి ఏర్పాటు సమయంలోనే అంబేద్కర్ కు గౌరవంగా ఒక విశాలమైన స్థలాన్ని కేటాయించి, భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం సంకల్పించింది, అయితే, 2019 తర్వాత వచ్చిన ప్రభుత్వాల నిర్ణయాల కారణంగా ప్రాజెక్ట్‌లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. పి.డబ్ల్యూ. గ్రౌండ్స్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసినప్పటికీ, అంచనాలకు మించి ఖర్చులు పెరగడం, పనుల్లో లోపాలు ఉండడం వంటి సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు.దీంతో ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, మొత్తం ప్రాజెక్ట్‌ను సమగ్రంగా సమీక్షించి, లోపాలను సరిదిద్దుతూ అంబేద్కర్ విగ్రహాన్ని పూర్తి చేసింది, గత ప్రభుత్వం చేసిన బాకీలను కూడా మా ప్రభుత్వం చెల్లించింది అని,దాదాపు రు.400 కోట్లకు పైగా వ్యయంతో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడం జరిగిందన్నారు.విగ్రహంతో పాటు చిల్డ్రన్స్ పార్క్, ఫుడ్ కోర్ట్, కన్వెన్షన్ సెంటర్ వంటి అనేక సదుపాయాలను కూడా పూర్తి చేసి ప్రజల కోసం అందుబాటులోకి తీసుకువచ్చాం,ప్రజల డబ్బు ప్రజల అవసరాల కోసం వినియోగించాలనే సంకల్పంతో ప్రతి రూపాయిని ఆదా చేస్తూ, సద్వినియోగం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్‌కు సుమారు రు.95 కోట్ల వ్యయం అవుతోంది. ఇది రాష్ట్రంలోనే అత్యాధునిక సదుపాయాలతో, సుమారు 1500 మంది కూర్చునే సామర్థ్యంతో నిర్మించబడింది, ఈ కన్వెన్షన్ సెంటర్‌ను కళాకారులు, సామాజిక కార్యక్రమాలు, ప్రభుత్వ సమావేశాలు, సదస్సులు వంటి అనేక అవసరాలకు వినియోగించుకునేలా రూపొందించాం. ఇందులో ఆధునిక సౌండ్ సిస్టమ్, స్క్రీనింగ్ సిస్టమ్, సౌకర్యవంతమైన సీటింగ్, ఎయిర్ కండిషనింగ్ వంటి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు.ఈ ప్రాజెక్ట్‌ను అద్భుతంగా నిర్మించిన కాంట్రాక్ట్ సంస్థలకు, ఇంజనీర్లు మరియు సంబంధిత అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నాం అని, త్వరలోనే ఈ కన్వెన్షన్ సెంటర్‌ను ప్రజల వినియోగంలోకి తీసుకువస్తామని అన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించాలని ప్రయత్నిస్తున్నాం, ఆయన ఆదేశాల మేరకు దీనిని ప్రారంభిస్తామన్నారు. ప్రారంభమైన తరువాత, ఇది విజయవాడ నగరానికి ఒక ప్రతిష్టాత్మక వేదికగా నిలుస్తుంది. విస్తృతమైన పార్కింగ్, క్యాంటీన్, లగ్జరీ గదులు, పూర్తి ఫర్నిషింగ్ వంటి అన్ని సదుపాయాలతో ఇది ప్రజలకు అందుబాటులో ఉంటుంధి అని,త్వరలోనే ప్రజలు ఈ సదుపాయాలను విస్తృతంగా వినియోగించుకుంటారని ఆశిస్తున్నాం అని తెలియజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కె.అనిల్ కుమార్, డైరెక్టర్ పి.వాసు దేవరావు, మేనేజర్ కృష్ణమోహన్, ప్రాజెక్టు మేనేజర్ రాఖ భాష, జనరల్ మేనేజర్ జగదీష్, డిపార్ట్మెంట్ ఏపీఐసీసీ చీఫ్ ఇంజనీర్ మణి భాస్కర్, జోనల్ మేనేజర్ బాబ్జి, ఏ ఈ ఎస్ కే ఇస్మాయిల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## గుడివాడలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల. అభివృద్ధి

### -ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

### -మౌలిక వసతులు కల్పన పై...


### -అర్బన్ గ్రీనరీ నిధులతో పార్కుల అభివృద్ధిపై దృష్టి.



గుడివాడ, ఏప్రిల్ 10 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ) గుడివాడ పట్టణ వ్యాప్తంగా త్రాగునీరు అందించే ప్రధాన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. రెండు ట్యాంకుల గట్ల పటిష్టతపై దృష్టి పెట్టినట్లు ఆయన వెల్లడించారు.అర్బన్ గ్రీనరీ అండ్ డెవలప్మెంట్ మరియు మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులతో గుడివాడ పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం సమావేశం అయ్యారు. పట్టణంలోని ప్రధాన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల అభివృద్ధి, బేతవోలులో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ, సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న చెరువు సమస్యలపై అధికారులతో ఎమ్మెల్యే రాము చర్చించారు. అర్బన్ గ్రీనరీ డెవలప్మెంట్ నిధులతో చేయనున్న అభివృద్ధి పనులపై అధికారులకు ఎమ్మెల్యే రాము పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ హెడ్ వాటర్ వర్క్స్ వద్దగల పాత, కొత్త సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల గట్లు పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నామనీ, అందుకు అవసరమైన నల్ల మట్టినీ ముందే సిద్ధం చేసేలా దృష్టి పెట్టినట్లు తెలిపారు. నాగన్న చెరువు అభివృద్ధికి సమావేశంలో చర్చించామన్నారు. అర్బన్ గ్రీనరీ నిధులతో పట్టణంలో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.స్థానికులు ఇచ్చిన విజ్ఞప్తుల మేరకు బేతవోలు చెరువులో డ్రాప్ట నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే రాము వెల్లడించారు. అర్బన్ డెవలప్మెంట్ నిధులు రూ.2.5 కోట్లతో బేతవోలులో డ్రైనేజీల నిర్మాణం, పార్కు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కమిషనర్ మనోహర్, ఎం. ఇ.ప్రసాద్,ఎ. ఓ. నాయుడు, ఏపీ జీబీసీ ఎస్. సి. చంద్రశేఖర్, జోనల్ మేనేజర్ బేబీ, ఇంజనీరింగ్ టీం, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఆలయంలోని

## సిబ్బందికి పలు సూచనలు చేసిన ఈఓ



విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రికి భక్తులు శుక్రవారం సాధారణ సంఖ్యలోనే తరలిరావడంతో దర్శనాలు సాఫీగా సాగాయి. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి మహానైవేద్యం సమర్పించిన అనంతరం, అంతరాలయ దర్శనాలను నిలిపివేసి భక్తులను లఘు దర్శనానికి అనుమతించారు. ఆలయ ఈఓ శీనానాయక్ ఘాట్ రోడ్డు మార్గంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆలయ పరిశుభ్రత, భక్తులకు అసౌకర్యం కలగకుండా చెప్పుల స్టాండ్లు, క్లోక్ రూమ్‌లు, ఆన్‌లైన్ కౌంటర్ల పనితీరును ఆయన దగ్గరుండి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## నగరంలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు

### వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి శుభోదయ):- నగరంలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు జరుగుతున్నాయని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆటోనగర్, ప్రసాదంపాడు ప్రాంతాలన్నీ పర్యటించి డీసిల్టింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ముఖ్యంగా నిర్మల కాన్వెంట్ రోడ్డు, పిన్నమనేని పాలిటెక్నిక్ రోడ్డు వంటి పలు ప్రాంతాలలో చిన్నపాటి వర్షానికి రోడ్డుపైన నీరు నిల్వ ఉండకుండా, అక్కడ ఉన్న డ్రైన్లలో మురుగునీటి ప్రవాహానికి ఎటువంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ఆ నీరు రైవస్ కాలువలో కలిసేంత వరకు, విజయవాడ నగరపాలక సంస్థ పరిధి కాకపోయినా, వర్షం పడినప్పుడు ఆ నీటి ప్రవాహం పరిధి దాటిన తర్వాత ఉన్న ఆటోనగర్, ప్రసాదంపాడు వైపు గల కాలువలలో అడ్డు ఉండటం వలన, వర్షపు నీరు తిరిగి నగర పరిధిలో ప్రవాహిస్తున్నందున సైడ్ డ్రైన్లు, మేజర్ ఔటఫాల్ డ్రైన్లలో కలిసేంతవరకు డీసిల్టింగ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నామని అన్నారు. ఈ పర్యటనలో సూపరేంటింగ్ ఇంజనీర్ వర్క్స్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ పి మోహన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్నభోజనాన్ని అందిస్తున్నాం

### : ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి శుభోదయ):- విద్యా రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రత్యేక మెను ఏర్పాటు చేసి ప్రతిరోజూ నాణ్యమైన ఆహారాన్ని మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తూ, పాఠశాల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. తూర్పులోని 6వ డివిజన్‌లో కోకో కోలా వీధిలోని, బెల్లపు శ్రీరాములు మున్సిపల్ స్కూల్‌ను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో వంద శాతం మంది విద్యార్థులు ఆహారాన్ని తీసుకుంటున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలో పాఠశాలలో 50 శాతం మంది విద్యార్థులు కూడా మధ్యాహ్న భోజనాన్ని తినేవారుకాదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 100 శాతం విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే మధ్యాహ్న భోజనాన్ని తింటున్నారని చెప్పారు. పాఠశాల నిర్మాణం చేసి చాలా సంవత్సరాలు అవుతున్నందువల్ల భవనం ధ్వంసమైందన్నారు. ఇటీవల వర్షాలు పడినప్పుడు కొండ రాళ్ళు పడి భవనంలో కొద్దిగా ధ్వంసమైందన్నారు. కొండ రాళ్ళు భవనం ఆవరణలో ఉండటం వల్ల పాఠశాలకు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారని పాఠశాల సిబ్బంది చెప్పారన్నారు. వెంటనే మంత్రి దృష్టికి తీసుకువెళ్ళి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వర్షాలు పడినప్పుడు భవనం పైభాగంగా నీరు నిల్వ ఉంటున్నాయని, భవనంపైన క్లీనింగ్ చేయడానికి మెట్లు నిర్మాణం చేస్తే ఎప్పటికప్పుడు నిల్వ ఉన్న నీటిని, వ్యర్థాలను శుభ్రం చేసుకోవచ్చునని అన్నారు. ఈ సమస్యలపై (కార్పరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ) స్కీమ్‌లో భాగంగా ప్రవేటు కంపెనీలతో మాట్లాడి వారు నిర్మాణాలు చేపట్టేలా చూస్తానని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. విద్యకు తమ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డీఎస్సీలో భాగంగా ఈ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టును కూడా భర్తీ చేశామన్నారు. ఈ పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే గద్దె తెలిపారు. ఈ కార్యక్రమంలో పడాల గంగాధర్, అమిర్నేని కరుణ, దయాల శరీషా గాంధీ, పొనగుపాటి మోహన్‌రావు, దాసరి గాబ్రియేల్, సప్ప శ్రీను, ఉనుగు దుర్గారావు, ఉప్పు శివకాంత్, మకర గురునాథం, శీర ప్రసాద్, పడాల నాగు, మొకర రామారావు, రాచమల్ల రాము, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, డీఈ బాలాజీ, ఏఈ.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే గద్దె రామమోహన్, గద్దె అనురాధ




విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి శుభోదయ):- ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యాక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ చెప్పారు. పటమట అశోక్‌నగర్‌లోని తూర్పులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్భార్ కార్యాక్రమం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే గద్దె తో పాటుగా తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ హజరై ప్రజల నుంచి వారి సమస్యలపై వినతిపత్రాలను తీసుకున్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బారు అనంతరం పార్టీ కార్యకర్తలతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా గద్దె రామమోహన్, గద్దె అనురాధ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజాదర్భార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సమస్యల గురించి అస్సలు పట్టించుకోలేదని చెప్పారు. ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించే విధంగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని చెప్పారు. అందువల్ల ప్రజలు ఈ ప్రజాదర్భార్ కార్యాక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారిద్దరూ కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ తమ డివిజన్లలోని ప్రజలకు తెలియజేసి సమస్యలు ఉన్నవారిని ప్రజాదర్బారుకు వచ్చి సమస్యలను తెలియజేసుకోవలసినదిగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమములో ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, గద్దె క్రాంతి, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పలు డివిజన్ల అద్యక్షులు, పార్టీ కార్యకర్తలు, పలు ప్రభుత్వ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## పన్ను చెల్లింపులపై ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోండి

### : వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి శుభోదయ):- పన్ను చెల్లింపులపై ప్రభుత్వం కల్పించిన రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2025- 26 ఆర్థిక సంవత్సరమునకు ఉన్న పన్ను బకాయిలను ఏక మొత్తంలో చెల్లించి 50% వడ్డీ రాయితీని పొందవచ్చని అలాగే 2026- 27 ఆర్థిక సంవత్సరమునకు ముందస్తుగా ఇంటి పన్ను, ఖాళీ స్థల పన్ను చెల్లించి 5% రాయితీని పొందవచ్చుని, ఈ అవకాశం ఈ నెల 30 వరకు మాత్రమేనని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని, ప్రజల సౌకర్యార్థం పన్ను చెల్లింపులు కేంద్రాలు సెలవు దినాల్లో కూడా అందుబాటులో ఉంచుతున్నామని కమిషనర్ కోరారు.

## రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

### నిబంధనలు ఉల్లంఘిస్తే మొబైల్ కోర్టులో హాజరు కావాల్సిందే

విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో రోడ్ల పైన చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రతి శుక్రవారం నిర్వహించే మొబైల్ కోర్టులో 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలీ లెనిన్ బాబు, శుక్రవారం ఉదయం సర్కిల్-2 కార్యాలయం, నందు సర్కిల్-2 పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లు నమోదు చేసిన 12 కేసులపై విచారణ జరిపి వారికి =ం. 4,780/- రూపాయలు జరిమానా విధించారు. మరోసారి ఈ విధంగా నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు.

ఈ సందర్భంగా రోడ్లపై మాట్లాడుతూ చెత్త వేసిన మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువుల్ని ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని నగర ప్రజలని మొబైల్ కోర్ట్ జడ్జి హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఏ ఎం ఓ హెచ్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్వైజర్స్ సలీం మహమ్మద్, శానిటరీ సెక్రటరీలు కార్యక్రమంలో పాల్గొనినారు.

## శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం

## కొండ చరియల పటిష్టతపై అధ్యయనం చేసిన 'నిర్మ్' బృందం

విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన పరిధిలోని కొండ చరియల పటిష్టతను శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు బెంగళూరులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (చీ×=వీ) నుండి సాంకేతిక బృందం శుక్రవారం ఉదయం దేవస్థానానికి చేరుకుంది. ప్రముఖ శాస్త్రవేత్త ప్రసన్న జైన్ నేతృత్వంలోని ఈ బృందం దేవస్థాన కార్యనిర్వహణాధికారి శీనానాయక్ ను కలిసి, క్షేత్రస్థాయి పరిశీలనపై కావలసిన ఏర్పాట్లు పై చెక్ లిస్ట్ సమర్పించి, చర్చించారు. ఈ సందర్భంగా అధ్యయన బృందం పలు కీలక అంశాలను వివరించింది. కొండపై తరచుగా రాళ్లు జారిపడుతున్న ప్రాంతాలు, ప్రస్తుతం పటిష్టంగా ఉన్న రాళ్ల విస్తీర్ణం, మట్టితో మిళితమై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ బృందం విశ్లేషించనుంది. భవిష్యత్తులో కొండపై నిర్మించతలపెట్టిన 'పాశుపాతాలయం' ప్రదేశం యొక్క భూగర్భ పటిష్టతను, అలాగే 2వ ఘాట్ రోడ్డు నిర్మాణానికి ఉన్న అనుకూల పరిస్థితులను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించనుంది. దేవస్థాన అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా, భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ అధ్యయన నివేదికను సిద్ధం చేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. అత్యాధునిక పరికరాల సహాయంతో నిర్వహించే ఈ సర్వే అనంతరం, కొండ చరియల పటిష్టతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శాశ్వత పరిష్కార మార్గాలతో కూడిన సమగ్ర నివేదికను దేవస్థానానికి సమర్పించనున్నట్లు చీ×=వీ బృందం వారు వెల్లడించింది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ అనేది గనులు, సివిల్ ఇంజనీరింగ్, మౌలిక సదుపాయాల రంగంలో రాళ్ల స్వభావాన్ని అధ్యయనం చేసే భారతదేశంలోని



అత్యున్నత స్థాయి పరిశోధనా సంస్థ. ఇంద్రకీలాద్రి వంటి కొండ ప్రాంతాల్లో నిర్మ్ చేసే పని తీరు , ప్రాముఖ్యత ఇలా ఉంటుంది. రాళ్ల పటిష్టత పరీక్ష కొండ ఏ రకమైన రాళ్లతో నిర్మితమైందో వీరు అత్యాధునిక సెన్సార్ల ద్వారా పరీక్షిస్తారు. రాళ్ల మధ్య ఉన్న పగుళ్లు, వాటి లోతు, వర్షం పడినప్పుడు ఆ పగుళ్లలోకి నీరు చేరి రాయి బలహీనపడే అవకాశం ఎంత ఉందనేది వీరు శాస్త్రీయంగా లెక్కిస్తారు. స్లోప్ స్టెబిలిటీ కొండ చరియలు విరిగి పడకుండా ఉండటానికి వీరు ప్రత్యేక పద్ధతులను సూచిస్తారు. ఏ ఏ కోణాల్లో (గూఅస్త్రీవం) కొండ రాయి వాలి ఉందో చూసి, ఎక్కడ రక్షణ గోడలు కట్టాలి, ఎక్కడ 'రాక్ బోల్టింగ్' (పెద్ద మేకులతో రాళ్లను బిగించడం) చేయాలి అనేది వీరు నిర్ణయిస్తారు. అత్యాధునిక సాంకేతికత వాడకం గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ : కొండ లోపల మట్టి ఎంత ఉంది, రాయి ఎంత ఉందనేది తవ్వకుండానే తెలుసుకోవడానికి దీన్ని వాడతారు. మైక్రో-సీస్మిక్ మానిటరింగ్: కొండలో వచ్చే అతి చిన్న ప్రకంపనలను కూడా గుర్తించి, భవిష్యత్తులో ప్రమాదం పొంచి ఉంటే ముందుగానే హెచ్చరిస్తారు. భారీ నిర్మాణాలకు పునాది విశ్లేషణ మీరు పేర్కొన్న పాశు పాతాలయం లేదా 2వ ఘాట్ రోడ్ వంటి భారీ నిర్మాణాలు చేపట్టేటప్పుడు, ఆ బరువును కొండ భరించగలదా లేదా అని 'లోడ్ టెస్టింగ్' చేస్తారు. నిర్మాణం వల్ల కొండపై అదనపు ఒత్తిడి పడకుండా డిజైన్లను సూచిస్తారు. పర్యావరణ సమతుల్యత కేవలం సిమెంట్ గోడలు కట్టడమే కాకుండా, ప్రకృతి సిద్ధంగా కొండను ఎలా కాపాడుకోవాలో వీరు నివేదికలు ఇస్తారు. గనులు మరియు సొరంగాల నిర్మాణంలో వీరికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఇంద్రకీలాద్రిపై భక్తుల భద్రతను నిర్ధారించడానికి, శాశ్వతమైన నిర్మాణాలను చేపట్టడానికి చీ×=వీ ఇచ్చే సాంకేతిక నివేదిక ఒక 'బ్లూ ప్రింట్' లాగా పనిచేస్తుంది. ఇది దేవస్థానానికి భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ కవచం లాంటిదని ఈవో పేర్కొన్నారు. ఈ బృందంతో సాంకేతిక సలహాదారు శ్రీ సుబ్రహ్మణ్యం, దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక కేంద్రంగా జగ్గయ్యపేట

### జగ్గయ్యపేటలో రూ.7.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపి కేశినేని చిన్ని

విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి శుభోదయ):- రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత వచ్చిన శుభ సందర్భంలో ఎన్టీఆర్ జిల్లాకు అన్ని శుభాలే జరుగుతున్నాయని, రాజధాని అమరావతి ప్రాంతంలోని జగ్గయ్యపేటకు మహార్దశ పట్టబోతోందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. రానున్న రెండేళ్లలో అభివృద్ధి పరంగా జగ్గయ్యపేట రూపురేఖలే మారిపోనున్నాయని, పారిశ్రామిక కేంద్రంగా జగ్గయ్యపేట పట్టణం అవుతుందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. జగ్గయ్యపేట కోదాడ రోడ్డులో విజయ డిజిటల్ దగ్గర మున్సిపాలిటీ డీఎంఎఫ్‌టి నిధులు రూ.7.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, ఇతర అభివృద్ధి పనులకు సంభంధించిన డీఎంఎఫ్‌టి గ్రాంట్ పైలాన్ శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ చిన్ని శుక్రవారం పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురామ్, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితర నాయకులతో కలసి అభివృద్ధి పనుల పైలాన్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఎంపీ చిన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతం హద్దులు తెలియని అజ్ఞానులు వైసిపి నాయకులు అన్నారు. జగ్గయ్యపేట పట్టణం రాజధాని అమరావతి ప్రాంతంలో భాగమే అని, పార్లమెంటులో జరిగిన అమరావతి చట్టబద్ధత బిల్లులో కూడా ఏపి ప్రాంతాలు అమరావతి రాజధాని పరిధిలోకి వస్తాయో వివరంగా ఉందని ఆ విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. అమరావతి రాజధాని అభివృద్ధి చెందాలంటే జగ్గయ్యపేట , నందిగామ వంటి ప్రాంతాలు అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. జగ్గయ్యపేట రాజధాని ప్రాంతంలో ఒక ముఖ్యమైన భాగం అన్నారు. 40 ఏళ్ల చరిత్రలో జగ్గయ్యపేటలో ఏనాడు లేని విధంగా ప్రస్తుత మున్సిపల్ పాలక వర్గం ఆధ్వర్యంలో అభివృద్ధి చర వేగంగా జరుగుతుందన్నారు. ఆ క్రమంలోనే డిస్ట్రిక్ట్ మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుండి రూ.7.15 కోట్ల నిధులతో జగ్గయ్యపేటలో వివిధ రోడ్లు, డ్రైన్ల పనులు, కల్వర్టుల నిర్మాణంకు ప్రస్తుతం శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. రానున్న కాలంలో జగ్గయ్యపేటను ఒక పారిశ్రామిక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ మేరకు ప్రభుత్వం వద్ద ప్రణాళికలు ఉన్నాయన్నారు. పారిశ్రామిక కేంద్రంగా జగ్గయ్యపేటను చేసేందుకు 1400 ఎకరాల స్థలం అవసరమని, దీనిపై ఇండస్ట్రియల్ సెక్రటరీతో చర్చలు జరుపుతున్నట్లు ఎంపీ తెలిపారు. డిఫెన్స్ పరిశ్రమల కోసం 1000 ఎకరాలు, జేఆర్డీ టాటా వాటర్ కోసం 500 ఎకరాల స్థలం కావాల్సి ఉందన్నారు. 40 సంవత్సరాల నాటి డంప్ యార్డు పరిష్కరించడం జరిగిందని, త్వరలోనే మంచినీటి సమస్య పరిష్కారంకు సైతం పనులు ప్రారంభిస్తామని వివరించారు. జగ్గయ్యపేట పరిధిలో నేషనల్ హైవే పనులు , సెకండ్ లైన్ రైల్వే పనులు పూర్తవుతున్నాయన్నారు. జగ్గయ్యపేట రైల్వే స్టేషన్‌కు ప్యాసింజర్ రైళ్లు వచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. జగ్గయ్యపేట 'స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ'గా పదోన్నతి పొందడం ఈ ప్రాంత అభివృద్ధిలో ముందడుగు అని ఎంపీ చిన్ని చెప్పారు. అప్‌గ్రేడ్ వల్ల కేంద్ర ప్రభుత్వం నుండి అమృత్ నిధులు , 16వ ప్లానింగ్ సంఘం ఫండ్స్‌ను ఉపయోగించుకునే అవకాశం కలిగిందన్నారు. ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధిపై ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశం జరుగుతుందని, ఆ సమావేశంలో జగ్గయ్యపేటలోని ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురామ్ , మున్సిపల్ ఛైర్మన్, పాలక వర్గం అందరిని కలుపుకుని రాబోయే 40 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా జగ్గయ్యపేటను మూడు రెట్లు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నామని ఎంపీ శివనాథ్ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కేవలం పట్టణాలే కాకుండా, రాష్ట్రానికి తలమానికమైన అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు . కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి భారీగా నిధులు తీసుకువచ్చి, ఏపీని దేశంలోనే నంబర్ వన్ స్టేట్ గా నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ జగ్గయ్యపేట ప్రజల చిరకాల కోరికలను నెరవేరుస్తూ, పట్టణ మౌలిక సదుపాయాల కోసం రూ. 7.15 కోట్లు వెచ్చించడం ఆనందంగా ఉందన్నారు . గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిన



అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు . ప్రతి వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటమే మా లక్ష్యం అని తెలియజేశారు.కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం శ్రీ రఘురామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ కేశినేని చిన్ని , ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య నాయకత్వంలో పూర్తి సహకారం ఉంటుందని తెలియజేశారు.మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామని, ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే మా ప్రాధాన్యత అని ఈరోజు ముఖ్య అతిథులుగా విచ్చేసిన పెద్దలందరి నేతృత్వంలో త్వరగా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవ వేడుకలు కూడా వారి చేతుల మీదుగా అంగరంగ వైభవంగా జరుపుతామని తెలియజేశారు. అలాగే పట్టణ అభివృద్ధికి సహకరిస్తున్న కౌన్సిల్ సభ్యులకు జగ్గయ్యపేట పట్టణ ప్రజానీకానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ మాట్లాడుతూ ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న జగ్గయ్యపేట, ఈరోజు విజయవాడకు సాటిగా అభివృద్ధి పథంలో దూసుకుపోతుండటానికి ప్రధాన కారణం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్నీ) , ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) , అలాగే కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం కృషి ,దూరదృష్టి నాయకత్వమే అని పేర్కొన్నారు. అందరి సమిష్టి నాయకత్వంలో జగ్గయ్యపేట ప్రాంతం అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తోందని, ముఖ్యంగా పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు ద్వారా యువతకు కొత్త ఆశలు కలుగుతున్నాయని తెలిపారు. ఇకపై మన పిల్లలు ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, మన రాష్ట్రంలోనే, జగ్గయ్యపేటలోనే మంచి ఉద్యోగ అవకాశాలు పొందే స్థితి ఏర్పడుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరామ్ ధనుంజయ్ చినబాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు మేక వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు శ్రీరామ్ సుబ్బారావు, నూకల కుమార్ రాజా, కట్టా వెంకట నరసింహారావు, మైనేని రాధా, ధూళిపాళ్ల లక్ష్మణరావు, అక్బర్ , మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## మీ ఇంట్లో దోమలు ఉండకూడదు అంటే ప్రతి ఫ్రైడే డ్రైడే పాటించాల్సిందే




విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి శుభోదయ):- నగరంలో పెరుగుతున్న దోమల సమస్యను నియంత్రించేందుకు ప్రతి ఇంట్లో ఫ్రైడేను, డ్రై డే గా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉదయం స్టేట్ బ్యాంక్ కాలనీ లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి ఆ ప్రాంతంలో గల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ వి. కామేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో దోమల సమస్యలను నియంత్రించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ విస్తృతమైన చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా నగరంలో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహం ఎక్కడ ఆగకుండా చూసుకుంటున్నారని, ట్రాక్టర్ మెషిన్ తో బోట్ల సహాయంతో సిబ్బంది కాలువల్లో పర్యటించి గుర్రపుడెక్కలను, వ్యర్థాలను తొలగిస్తున్నారని, సిబ్బంది వెళ్లలేని చోట డ్రోన్ ని పంపించి ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేసి దోమల లార్వా ఉత్పన్నమవకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మరోవైపు నగర పరిధిలో ఫాగింగ్, స్ప్రేయింగ్, మరి కొన్నిచోట్ల దోమల లార్వాని తినే గంబోజియా చాపలను విడుదల చేస్తూ నగరంలో దోమల నియంత్రణకు విస్తృతమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఒకవైపు విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రతి ఇంట్లో దోమలు ఉత్పన్నం అవ్వకుండా డ్రైడే పాటించాలని అది ప్రతి శుక్రవారం పాటిస్తే ప్రతి ఇంట్లో దోమల సమస్యలు ఉండవని అన్నారు. ప్రతి శుక్రవారం తమ ఇంట్లో, ఇంటి చుట్టు పరిసరాలలో ఎక్కడ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా తొట్లు, వాడుక లేని బకెట్లు, మగ్గులు, డ్రమ్ములు, పూల కుండీలు, అలా ఏ వస్తువు అయినా వాడుకంలో లేనివి అందులో నీటి నిల్వ ఉండే అవకాశం ఉన్నవి, ప్రతి శుక్రవారం వాటిని గమనించి ఆ నిల్వ ఉన్న నీరుని పారవేస్తే ఇంట్లో దోమల సమస్య తగ్గుతుందని అన్నారు. అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వారి ఇంటి వద్దకు వెళ్లి నీటి నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కడ ఉన్నాయని చూపించి, వాటిని పారేస్తే అందులో లార్వా చచ్చిపోతుందని వారికి అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం దీన్ని పాటిస్తే దోమలను శాశ్వతంగా నియంత్రించవచ్చని వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు సానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర 2047 సాధనే ధ్యేయంగా పనిచేద్దాం

### జల జీవన్ మిషన్ పథకం ద్వారా నియోజవర్గంలోని అన్ని గ్రామాలకు త్రాగునీరు అందించండి




పుట్టపర్తి, నేటి శుభోదయ ::: స్వర్ణాంధ్ర 2047 సాధన ధ్యేయంగా అధికారులంతా కలసి కట్టుగా పనిచేయాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. నియోజవర్గం లో జలజీవన్ మిషన్ ద్వారా అన్ని గ్రామాల్లో ఇంటింటికి త్రాగునీరు అందించాలని కోరారు . అదే విధంగా ప్రసవ సమయంలో తల్లి ,బిడ్డ సంరక్షణ కోసం టార్బ్టెలిన్ ఇంజెక్షన్ ప్రతి నియోజకర్గ స్థాయిలోనీ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా నియోజవర్గం లో చిన్న వయసులో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని అరికట్టాలని సూచించారు అంతేకాకుండా చిన్న వయసులోనే వివాహాలు జరిగి ప్రసవాలు ఎక్కువగా నమోదు కావడం వల్ల వారికి జన్మించే పిల్లలు జన్మిలోపముతో ఎక్కువగా చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని క్షేత్రస్థాయిలో వైద్య అధికారులు ,ఐసిడిఎస్ , డిఆర్డిఏ ఐకెపి అధికారుల సమన్వయంతో మహిళల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీఎం సూర్యగర్ ప్రాజెక్టు నియోజకవర్గంలో బాగా వెనుకబడిందని వీటిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ద్వారా విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పుట్టపర్తి పట్టణంలో శాశ్వత త్రాగునీటి పరిష్కారానికి 130 కోట్లతో సమగ్ర త్రాగునీటి పథకానికి సత్వరం టెండర్లు పిలిచి వాటిని సకాలంలో పూర్తిచేసేలా చూడాలని కోరారు. అదేవిధంగా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా నల్లమాడ ,ఓడి చెరువు కు, ఆమడ గూరు మండలాలకు సుమారు 324 గ్రామాలకు సరఫరా జరిగే సత్యసాయి త్రాగునీటి పథకం ద్వారా గతంలో ప్రజలకు సరిపడే నీరు సరఫరా అయ్యేదని ప్రస్తుతం పైపులైను సక్రమంగా లేకపోవడం వల్ల నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయిందని జిల్లా అధికారులు దృష్టికి తీసుకువచ్చారు . జల జీవన్ మిషన్ ద్వారా ఈ త్రాగునీటి పథకానికి కొత్త పైపులైన్ వేసి నీటి సరఫరాను అందిస్తే ఆ మూడు మండలాలకు శాశ్వత నీటి పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా కొత్తచెరువు పుట్టపర్తి బుక్కపట్నం మూడు మండలాలకు ముదిగుబ్బ పాముదుర్తి బుచ్చయ్య గారి పల్లి మీదుగా పుట్టపర్తికి త్రాగునీటి పైపులైను ద్వారా ఇక్కడ ప్రజలకు నీటి సరఫరా జరుగుతోందని రహదారుల విస్తరణ వల్ల బుక్కపట్నం మండలం బుచ్చయ్య గారి పల్లి వద్ద పైపులైను తొలగించడం వల్ల ఏడాది నుంచి నీటి సరఫరా ఆగిపోయిందని వీటిని సకాలంలో పూర్తి చేసి ప్రజలకు నీటి సరఫరా చేయాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి వల్ల స్వర్ణాంధ్ర సుపరిపాలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు.

## మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులలో క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసంను పెంపొందిస్తాయి

రాగం హరిశంకర్ యాదవ్..




శేరిలింగంపల్లి నేటి శుభోదయ .. :శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ పరిధిలోని నాగార్జున గ్రామర్ హై స్కూల్‌లో న్యూ మోంక్స్ కుంగ్-ఫూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో కుంగ్-ఫూ బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 226-నల్లగండ్ల డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాగం హరి శంకర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై సుమారు 40 మంది విద్యార్థులకు తదుపరి స్థాయి బెల్టులు, ధృవపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కుంగ్-ఫూ వంటి శిక్షణలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని కూడా పెంచుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతర సాధనతో ఉన్నత స్థాయిలకు ఎదిగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కుంగ్-ఫూ నైపుణ్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చిన్న వయస్సులోనే ఈ తరహా శిక్షణ పొందడం వారి సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.ఈ కార్యక్రమంలో పాఠశాల కొరస్పాండెంట్ కె. శ్రీనివాస్ శంకర్, ప్రధానోపాధ్యాయురాలు కె. శిరీష, తెలంగాణ కుంగ్-ఫూ అసోసియేషన్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎన్. బాలరాజు యాదవ్, రంగారెడ్డి జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి. రమేష్, మహబూబ్‌నగర్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె. సత్యం, బ్రూస్ లీ కుంగ్-ఫూ ప్రతినిధి నందు, హైదరాబాద్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఏ. యోగేశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే గారి జయంతి కార్యక్రమానికి ఆహ్వానం కాకి ఈశ్వర్ ముదిరాజ్



( నేటి శుభోదయ మహేశ్వరం ఏప్రిల్ 10:) మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో పోలీస్ స్టేషన్ దగ్గర అంబేద్కర్ చౌరస్తా లో సంఘసంస్కర్త క్రీస్తు శేషులు మహాత్మ జ్యోతిరావు పూలే 200 వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించడానికి. మన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. కార్యకర్తలు మహేశ్వరం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ .వైస్ చైర్మన్ .డైరెక్టర్లు .ఆలయ కమిటీ చైర్మన్లు.వైస్ చైర్మన్లు. డైరెక్టర్లు.మాజీ జెడ్పిటిసిలు .మాజీ ఎంపీటీసీలు.మాజీ సర్పంచులు. నూతన సర్పంచులు. మాజీ ఉప సర్పంచులు. నూతన ఉపసర్పంచులు. మాజీ వార్డ్ నెంబర్లు. నూతన వార్డు మెంబర్లు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు. విద్యా కమిటీ చైర్మన్ లు. విద్యా కమిటీ సభ్యులు.కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు. కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు. కమిటీ సభ్యులు. అనుబంధ సంఘాలు బీసీ . ఎస్సీ ఎస్టి మైనార్టీ. మహిళ. యువజన. ఎన్ఎస్ యుఐ. సోషల్ మీడియా. సంఘాల అధ్యక్షులు. ప్రతినిధులు. సభ్యులు. గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు. నూతన అధ్యక్షులు. కమిటీ సభ్యులు. అందరూ రేపు శనివారం రోజున ఉదయం 10గంటలకు సకాలంలో విచ్చేసి కార్యక్రమంలో పాల్గొనాలని కోరడమైనది కాకి ఈశ్వర్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్



శేరిలింగంపల్లి నేటి శుభోదయ .. :టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ "ఎడ్యుకేట్ , ఎగిటెట్, ఆర్గనైజ్" అనే మంత్రం కేవలం మాటలు మాత్రమే కాకుండా, అది ఒక శక్తివంతమైన ఉద్యమం మరియు తరతరాలకు స్ఫూర్తినిచ్చే జీవన విధానం అని పేర్కొన్నారు.శుక్రవారం రోజు మియాపూర్ డివిజన్‌లోని మియాపూర్ బస్ డిపో వద్ద నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాకుండా, ఒక మహా విప్లవకారుడు, అణగారిన వర్గాల ఆశాకిరణం, సమానత్వానికి ప్రతీక అని అన్నారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు నేటికీ సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నాయని, ఆయన కలల భారతదేశాన్ని నిర్మించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.అదనంగా, అంబేద్కర్ జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుందని, ఎలాంటి కష్టాలు, అణచివేతలు ఎదురైనా సంకల్పం మరియు విద్యతో సమాజంలో మార్పు సాధ్యమని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో సామ్రాట్, కోటేశ్వరరావు, కావూరి ప్రసాద్, మన్నేపల్లి సాంబశివరావు, యలమంచి ఉదయ్ కిరణ్, కట్ల శేఖర్ రెడ్డి, తాండ్ర రాంచందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాకీర్, నరేందర్ ముదిరాజ్, రవికుమార్ గౌడ్, దివాకర్ రెడ్డి, నర్సింగ్ రావు, మన్నే విజయ్ ముదిరాజ్, శామ్యూల్, కృష్ణ,వంశీ ,రాజేష్,చారి తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచులకు అండగా కల్యాణ లక్ష్మి,ఎమ్మెల్యే

-కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



నేటిశుభోదయ: తలకొండపల్లి (ఏప్రిల్ 10):రాష్ట్ర ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు.శుక్రవారం తలకొండపల్లి మండలంలోని దేవకీ గార్డెన్ లో తలకొండపల్లి మండలానికి చెందిన 84 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు,ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా



ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని అన్నారు.రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశానికే మార్గదర్శిగా మారారని కొనియాడారు.పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని స్పష్టం చేశారు.అనంతరం ఎమ్మెల్యే, తాసిల్దార్ రమేష్, లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,అధికారులు,వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు,మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- ప్రజలు ఇచ్చిన అర్జీలు మళ్ళీ రిపీట్ కానీవొద్దు
- ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి




పుట్టపర్తి , నేటి శుభోదయ ::: ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.ప్రజా సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అర్జీలు మళ్ళీ రిపీట్ కానీవొద్దనీ సూచించారు. అర్జీదారులు ఇచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ఒకే సమస్యపై అదే పనిగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికార యంత్రాంగానికి సూచించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ప్రజలతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటి కోసం కూటమి ప్రభుత్వం రెవిన్యూ క్లినిక్ లు,రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేసి మీ భూమి మీ హక్కు అనే కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. ఏ గ్రామాల్లో భూ తగాదాలు లేకుండా చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా భూ రీ సర్వే నిర్వహించి ప్రభుత్వ రాజముద్ర కలిగిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు అందిస్తోందని వెల్లడించారు. అలాగే గ్రామాల్లో త్రాగునీటి సమస్య , విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రజలకు త్రాగునీటి సరఫరాను అందించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా భూ సమస్యలపై అధిక ఫిర్యాదులు వస్తున్నాయని వీటి పరిష్కారం కోసం ఆర్డీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్లను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు అలాగే మండల తహశిసిల్దార్ కార్యాలయాల్లో సోమవారం గ్రీవెన్స్ ఏర్పాటు చేశారని అలాగే ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్ ఏర్పాటు చేసి ఈ సమస్యలకు తగిన పరిష్కారం చూపే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. గ్రామాల్లో విద్యుత్ రెవిన్యూ ఆర్డబ్ల్యూఎస్ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంచాయతీ సెక్రెటరీలు, వీఆర్వోలు సచివాలయ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఒక సమస్య పైన సుదీర్ఘకాలంగా పరిష్కరించకుండా ప్రజలను ఇబ్బంది పెడితే సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని అందుకు క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ తో పాటు సచివాలయ అధికారులు స్థానికంగా పర్యటించి సమస్యలను తక్షణ పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికారులు నియోజకవర్గ ప్రజలు ,కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు ,నాయకులు పలువురు పాల్గొన్నారు.



# సోమశిల శ్రీశైలం హెలికాప్టర్ ప్రయాణానికి హైకోర్టు బ్రేక్

మెట్రోలో ప్రయాణించిన మంత్రి "జూపల్లి" హైకోర్టు స్టే తో ఎగురని హెలికాప్టర్ పరేషాన్ లో పర్యాటకులు





మహబూబునగర్ వనపర్తి జిల్లా నేటి శుభోదయ ఏప్రిల్ 10 :నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని పవిత్ర పుణ్యక్షేత్రం సోమశిల నుంచి వయా శ్రీశైలం హైదరాబాద్ వరకు తెలంగాణ పర్యాటకశాఖ ఈనెల 9 నుంచి ప్రారంభం చేయబోయే హెలి టూరిజం పర్యటన హైకోర్టు బ్రేకు వేసింది. సోమశిల లోని ద్వాదశ జ్యోతిర్లింగాల తో కొలువైన శ్రీ లలితాంబికా సోమేశ్వర క్షేత్రం తో పాటు శ్రీశైలం పుణ్యక్షేత్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి అమ్మవారి దర్శనం దర్శనం అక్కడి అందాలు చూడదగ్గ ప్రదేశాలను పర్యాటకులకు టూరిజం శాఖ హెలికాప్టర్ ద్వారా వీక్షించే అవకాశం కల్పిస్తున్న సందర్భంలో సోమశిల దగ్గర హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు నష్టం జరుగుతుందని ఈ విషయం పైన కొల్లాపూర్ బిజెపి నాయకుడు ఏ సుధాకర్ రావు తో పాటు ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు ముందస్తు రైతుల అనుమతి లేకుండా ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా అన్యాయంగా అక్రమంగా అధికార పార్టీ నాయకులు మంత్రి అధికారులను అడ్డం పెట్టుకొని బలవంతంగా రైతుల భూములను హెలికాప్టర్ కోసం నిర్మాణం చేపల విషయం పైన పోరాటాలు చేశారు. రైతులకు న్యాయం చేయాలని పోరాటం చేసినప్పటికీ సంబంధిత అధికారులు న్యాయం చేయకపోవడం మూలంగా చివరకు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడం వల్ల హైకోర్టు రైతుల అనుకూలంగా స్టే విధిస్తూ ఆదేశాలను జారీ చేసింది. దీంతో టూరిజం హెలికాప్టర్ ప్రయాణానికి తూట్లు పడ్డాయి. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించే వనరులు ఉన్నప్పటికీ నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ఆర్థికంగా వెనుక పడుతున్న ఈ ప్రాంతంలో మామిడి పరిశ్రమతో పాటు కాగితపు పరిశ్రమ, చేపల పరిశ్రమ, తదితర ఉపాధి కల్పించే పరిశ్రమలను నెలకొల్పకుండా ధనవంతుల కోసం శ్రీమంతుల కోసం గాలి మోటర్ ప్రయాణం కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవడం పట్ల ఈ నియోజకవర్గంలోని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గాలి మోటార్ ప్రయాణం పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉపయోగం లేదని ఒక్కొక్కరికి 1,30,000 టికెట్ తో ఈ ప్రయాణం సామాన్యుడు చేసే పరిస్థితి లేకపోయినప్పటికీ టూరిజం శాఖ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక అంతర్యం ఏముందని ప్రశ్నలు వస్తున్నాయి. సోమశిల లో హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం నిర్మాణం చేస్తున్న భూములు రైతులు కష్టపడి సంపాదించుకున్న వ్యవసాయ భూములు జీవనోపాధి కల్పించే స్థిరాస్తులు కోల్పోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో హైకోర్టు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ గాలి మోటర్ ప్రయాణం నిలిచిపోవడంతో ఒక్కసారిగా ఈ ప్రాంత ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. టూరిజం హెలికాప్టర్ ప్రయాణం రద్దు కావడంతో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు హైదరాబాదులోని మెట్రో రైల్లో ప్రయాణిస్తూ మరొకసారి ప్రయాణికులను అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు. కొల్లాపూర్ ప్రాంతంలో హెలికాప్టర్ ప్రయాణం రద్దు కావడం మంత్రి మెట్రోలో ప్రయాణించడం వల్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొల్లాపూర్ ప్రాంతంలో శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరుద్యోగ యువతీ యువకులు డిమాండ్ చేస్తున్నారు. తరాలు మారిన ఈ ప్రాంత ప్రజల తలరాతలు మారడం లేదని ప్రజలు అంటున్నారు. అన్ని వనరులు ఉన్న అల్లుడి నోట్లో శని ఉన్నట్లు ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ ప్రాంతాన్ని గతంలోని వెలమ దొరల పాలనలో అభివృద్ధిలో వెనక్కి నెట్టివేయబడింది. దేశానికి స్వాతంత్ర సిద్ధించిన తర్వాత 60 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ పాలనలో సురభి వెలమ దొరల పాలన కొనసాగిందని నేటికి కూడా ఈ ప్రాంతంలో బహుజనులు అత్యధికంగా ఉన్నప్పటికీ రాజకీయాల్లో ముందుకు రాణించలేక పోతున్నారని చర్చ కొనసాగుతుంది. ఇప్పటికైనా రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా బహుజనులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే విధంగా పాలక ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు మొదలు పెట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అమీర్ పేట్ లో మన్నాన్‌పల్లి వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో స్ట్రీట్ లైట్స్ ప్రారంభం



( నేటి శుభోదయ మహేశ్వరం ఏప్రిల్ 10:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గము మహేశ్వరం మండలపరిధిలోని అమీర్ పేట్ గ్రామంలో స్ట్రీట్ లైట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచన్న గారి లక్ష్మారెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.గ్రామ శాఖ అధ్యక్షుడు మన్నాన్‌పల్లి వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన సదుపాయాల విస్తరణలో భాగంగా స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు రాత్రి వేళల్లో సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, మండల మాజీ అధ్యక్షుడు ఆవుల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ వర్కల యాదగిరి గౌడ్, కేజే ప్రసాద్ హాజరయ్యారు. అలాగే ఇంద్రమ్మ కమిటీ అధ్యక్షుడు ఆవుల రఘుపతి, గ్రామ వార్డు సభ్యులు డప్పు జనార్ధన్, ఎండి షఫీ, మంచినీళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు డప్పు నరసింహ, వర్కల సత్తయ్య గౌడ్, వర్కల నరేందర్ గౌడ్, ఎర్ర శంకరయ్య, కమ్మరి యాదయ్య, గల్లా శ్రీకాంత్, డప్పు జంగయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇంద్రమ్మ కమిటీ సభ్యులు కడల భాస్కర్, వర్కల రమేష్ గౌడ్, ఎర్ర చంద్రమోహన్, తాళ్ల రమేష్ గౌడ్, నీరటి మల్లేష్, గల్లా అనిల్, కుర్వ శివకుమార్, కంది వినయ్, సిహెచ్ అనిల్, సిహెచ్ బాలు, తొంట సంతోష్, సిహెచ్ శ్రీకాంత్, ఆవుల ఆనంద్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గ్రామ అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత కొనసాగాలని నాయకులు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి సింహాద్రి అప్పన్న చందన మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి



విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి శుభోదయ):- శ్రీనివాసమహల్ సెంటర్ వద్ద నిర్వహించిన శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి సింహాద్రి అప్పన్న చందన మహోత్సవ వేడుకలల్లో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ"సింహాద్రి అప్పన్న ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, నగరం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొనడం జరిగింది. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతిని, ఐక్యతను పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు.

## నందిగామ పట్టణ టైలర్స్ యూనియన్ అధ్యక్షులుగా తుమ్మ జగన్నాథం ఎన్నిక.



నందిగామ,ఏప్రిల్ 10(నేటి శుభోదయ):నందిగామ పట్టణ టైలర్స్ యూనియన్ అధ్యక్షులుగా తుమ్మ జగన్నాథం ఎన్నికైన తర్వాత నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్యను సంఘ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది.ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులను శాసనసభ్యులు సౌమ్యను పరిచయం చేయడం జరిగిందనిఅన్నారు.శుక్రవారం10న కలవటం జరిగింది.నందిగామ పట్నం టైలర్స్ ను ఎమ్మెల్యే సభ్యులను అభినందించారు.అధ్యక్షుడు జగన్నాథంను దుశ్యాలువతో సన్మానించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు జగన్నాథం శాసనసభ్యులు దృష్టికి టైలర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టికి తీసుకుని వచ్చారు.రెడీమేడ్ దుస్తులు వలన టైలర్స్ కు పని దొరకటం లేదని మరియు దీనిపై జీవించడం చాలా కష్టంగా ఉందని.షాపులు రెంటల్ కట్టడం కూడా చాలా ఇబ్బందిగా ఉందని ప్రభుత్వం మిషన్ కుట్టడం కూడా చేతి వృత్తిగా భావించి 200 యూనిట్ల వరకు విద్యుత్ రాయితీ కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రామిరెడ్డి నరసింహారావు,గూట్ల నాగేశ్వరరావు,షేక్ బాబు,షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



పులిచెర్ల, ఏప్రిల్ 10,(నేటి శుభోదయ) :ప్రయాణికుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కల్లూరు సిఐ జయరామయ్య. ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు పోలీస్ స్టేషన్ ఆవరణంలో శుక్రవారం మండలంలోని ఆటో డ్రైవర్లకు రోడ్ సేఫ్టీ పై కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ జయరామయ్య ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రయాణకుల పట్ల దురుసుగా ప్రవర్తించరాదని నిషేధిత వస్తువులు తీసుకుని పోరాదని అతివేగం పనికిరాదని అన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ వాహనాలకు సంబంధించిన రికార్డులు తమ వద్ద ఉంచుకోవాలని తనిఖీల సమయంలో తప్పనిసరిగా పోలీసులకు చూపించాలని అన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే చర్యలు తప్పవని అన్నారు అనంతరం రోడ్డు సేఫ్టీ పై పలు సూచనలు చేశారు.

## పాకాల బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సలీం



పులిచెర్ల, ఏప్రిల్ 10,(నేటి శుభోదయ) :తిరుపతి జిల్లా. పాకాల బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కల్లూరు కు చెందిన న్యాయవాది ఎస్ ఎన్ ఎం సలీం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గౌరీ శంకర్ రాజు కార్యదర్శిగా ప్రవీణ్ ప్రకాష్ ఎంపికయ్యారు. ఈ సమావేశంలో న్యాయవాదులు గురు స్వామి నాయుడు సుబ్రహ్మణ్యం రెడ్డి, రెడ్డప్ప నాయుడు, మురళి చంద్రమోహన్, సాయి తేజ ముని, సునీల్ తిరుపతి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నరహరి రెడ్డి రాజా శ్రీనివాస్. భగీరథ రెడ్డి, గుప్త తదితరులు పాల్గొని కార్యవర్గాన్ని అభినందించారు.

# ఐటి కారిడార్‌లో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

## అదుపుతప్పి పోలీస్ల ఔట్‌పోస్టును ఢీకొన్న కారు

## కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలు

హైదరాబాద్: హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మసీద్ బండ నుంచి కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఓ కారు అదుపు తప్పి ట్రాఫిక్ అవుట్‌పోస్టును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం కూడా తీవ్రంగా దెబ్బతింది. కారు ఇంజిన్ భాగం లోపలికి చొచ్చుకు పోయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది.సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపే అవకాశం ఉంది. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. సీసీటీవీ ఫుటేజీని కూడా పరిశీలిస్తున్నారు. ఐటీ కారిడార్ పరిధిలో అర్ధరాత్రి వేళల్లో రోడ్లు ఖాళీగా ఉన్నాయని అతివేగంగా వెళ్లడం ప్రమాదాలకు దారితీస్తోందని పోలీసులు తెలిపారు. గచ్చిబౌలి, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో పోలీసులు ఎన్ని తనిఖీలు చేస్తున్నా ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. వేగం కంటే ప్రాణం ముఖ్యమని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు సూచించారు.

# పోలీసుల కిరాతక చర్యలకు ఓ హెచ్చరిక

## తమిళనాడు మధురై కోర్టు తీర్పుపై సర్వత్రా చర్చ

## పోలీసులపై పనిభారం తగ్గించాలని సూచనలు

విజయవాడ,:ఆరేళ్ళ క్రితం తమిళనాడులో జరిగిన 'లాకప్ డెత్' కేసులో ట్రయల్ కోర్టు విచారణ ముగిసి తొమ్మిది మంది పోలీసులను ముద్దాయిలుగా ఖరారు చేస్తూ వారందరికీ మరణ శిక్ష విధించడం సంచలనం కలిగించింది. ఈ తీర్పుపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది. పోలీసుల అతిపై కోర్టు సరైన తీర్పు ఇచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే స్టేషన్‌లో టార్చర్ పెట్టే వారికి ఈ కేసు ఓ హెచ్చరికగా సూచిస్తున్నారు. ఇక వివరాల్లోకి వెళితే...కరోనా సమయంలో సదరు లాక్‌డౌన్ నిబంధనల్ని అతిక్రమించారన్న కారణంతో చిరు వ్యాపారులైన తండ్రీకొడుకులను అరెస్ట్ చేశారు. వారిని ఆ రాత్రంతా చిత్రహింసలకు గురిచేయగా ప్రాణాలు కోల్పోయారు. కస్టడీ లోకి తీసుకున్న ఆరోగ్యవంతులైన ఇద్దరు పౌరులు ఒక్క రోజులోనే అనారోగ్యంతో మరణించడానికి పోలీసులు పెట్టిన చిత్రవధ ఏకైక కారణం అన్నది తేలిపోయింది. ఆ దుర్మార్గపు చర్య ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, ఆందోళన నింపగా మద్రాస్ హైకోర్టు సుమోటోగా కేసుని స్వీకరించి?సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఫలితంగా పోలీసుల నేరం నిరూపణ అయ్యింది. బాధాకరమైన విషయమేమిటంటే ఆ మృతులిద్దరూ కరోనా లాక్‌డౌన్ నిబంధనల్ని కూడా అతిక్రమించలేదని. అది కూడా తప్పుడు బనాయింపు అని. ఆ సంఘటనకి బాధ్యులైన 9 మంది పోలీసు అధికారులకూ నేడు కోర్టు మరణ శిక్ష విధించడం సరైన తీర్పు. ఇంకా పైకోర్టులో అప్పీళ్లు, న్యాయ పక్రియలు పూర్తయ్యి అంతిమ తీర్పు రావడం ఎలాఉన్నా ప్రస్తుతానికి బాధిత కుటుంబాలకు ఊరట. అధికారాన్ని అడ్డుపెట్టుకుని,చేయగూడని పనులు చేసే అధికారులకు ఇది ఒక హెచ్చరిక. ఇదే సమయంలో దేశం పోలీసు సంస్కరణల దిశగా ఆలోచించాలి. వారు ఎదుర్కొంటున్న విపరీత పని ఒత్తిడి సమస్య, సిబ్బంది లేమి, దర్యాప్తు, శాంతి భద్రతలను వేర్వేరుగా నిర్వహించే యంత్రాంగం లాంటివి తీర్చుతూనే, తప్పుడు పనులు చేసే అధికారుల్ని వెంటనే కఠినంగా శిక్షించే ఏర్పాట్లు ఉండాలని అంటున్నారు. సమాజానికి అప్పుడే శాంతిభద్రతలకు భరోసా ఉంటుందని భావిస్తున్నారు.

# మరోమారు షాకిచ్చిన పసిడి ధర

## ఏకంగా రూ.1,520 పెరుగుదల

న్యూఢిల్లీ: పసిడి ప్రియులకు మరోసారి షాకిస్తూ బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడి పరుగు కొనసాగుతోంది. తాజాగా 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధరపై ఏకంగా రూ. 1,520 పెరగడంతో, ప్రస్తుతం రూ. 1,53,000 మార్కుకు చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ. 1,400 మేర ఎగబాకి, 10 గ్రాముల ధర రూ. 1,40,250 వద్ద కొనసాగుతోంది. పసిడితో పాటే వెండి కూడా అదే స్థాయిలో దూసుకుపోతోంది. కిలో వెండి ధరపై ఏకంగా రూ. 5,000 పెరగడంతో ప్రస్తుత ధర రూ. 2,65,000కి చేరింది. వరుసగా పెరుగుతున్న ఈ ధరలతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పాముకాటుతో బాలిక మృతి

## ఆస్పత్రికి తరలించే లోపే హరీమన్న ప్రాణం


కాకినాడ,: యు.కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటలో విషాద ఘటన చోటు చేసుకుంది. పాము కాటుకు గురై చప్పా దీపిక(13) అనే బాలిక మృతి చెందింది. ఇంట్లో మంచం మీద నిద్రిస్తుండగా రాత్రి 2.30 సమయంలో బాలికను త్రాచుపాము కరిచింది. ఎలుక కరిచిందని భావించి తల్లి మల్లీశ్వరికి చెప్పగా ఉదయం ఆసుపత్రికి వెళ్ళి ఇంజెక్షన్ చేయిద్దామని చెప్పడంతో మరలా బాలిక నిద్రించింది. అయితే తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇబ్బందిగా ఉందని బాలిక చెప్పడంతో ఆసుపత్రికి తీసుకెల్దామని బంధువులను పిలిచింది. అప్పటికే బాలికకు నోటి వెంట నురగలు రావడంతో అంబులెన్స్‌కు కుటుంబసభ్యులు సమాచారం అందించారు. ఆసుపత్రిలో వివరాల కోసమని ఆధార్ కార్డు వెతుకుతుండగా మంచం పక్కనే తాచుపాము కనిపించడంతో కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. పాము కరిచిందని నిర్ధారించుకుని హుటాహుటిన బాలికను ఆస్పత్రికి తరలించాలని భావించగా.. అంబులెన్స్ వచ్చేలోపే పరిస్థితి విషమించడంతో దీపిక ప్రాణాలు కోల్పోయింది. ఇటీవలే కోనపాపపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి పరీక్షలు రాసి తొమ్మిదో తరగతిలోకి దీపిక ప్రవేశించింది. బాలిక మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# ప్రేమజంట ఆత్మహత్య

## ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


పల్నాడు,: కొండవీడు కోటలో ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ ప్రేమ విహహాన్ని తల్లిదండ్రులు నిరాకరించడంతో తీవ్ర మనస్తాపం చెందిన ప్రేమజంట పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. యువతీ, యువకుడు ప్రేమించుకోగా.. వారి ప్రేమను పెద్దలు నిరాకరించారు. యువతికి తల్లిదండ్రులు వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. దీంతో ఆమె తీవ్రంగా మనస్తాపానికి గురైంది. పెళ్లి అయిన తర్వాత కూడా ప్రేమించిన వ్యక్తిని మరిచిపోలేక... భర్తను వదిలేసి ప్రేమికుడి వద్దకు వచ్చేసిందా యువతి. ఇద్దరు కలిసి జీవించాలని అనుకున్నప్పటికీ పెద్దలు తమ వివాహాన్ని అంగీకరించరని భావించిన ప్రేమజంట కఠిన నిర్ణయం తీసుకుంది. ఈనెల 7న కొండవీడు కోటకు వచ్చిన వీరిద్దరు.. అక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. వెంటనే గమనించిన స్థానికులు వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరూ చనిపోయారు. వీరిద్దరూ గుంటూరుకు చెందిన వారుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రేమ జంట మృతిపై వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

# డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు కట్టించి ఇస్తాం



తిరుపతి : పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే ప్రభుత్వ నిర్ణయమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండోసారి గృహ ప్రవేశాలు చేస్తున్నామని సిఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల గృహప్రవేశాలు జరుగుతున్నాయని చెప్పారు. తిరుపతి జిల్లాలో 15,659 ఇళ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 5.50 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చామని, డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పారు. సోమవారం తిరుపతి జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు పుదూరులోని టిడ్కో ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్కులు, వాకింగ్ ట్రాక్ ఇతర మౌలిక సదుపాయాలతో ఈ గృహ సముదాయాలను నిర్మించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ .... అర్బన్ కింద కేంద్రం ఇచ్చిన డబ్బులను గత ప్రభుత్వం దుర్వినియోగం చేసిందన్నారు. " గత ప్రభుత్వం రూ. 816 కోట్లు అప్పు పెట్టింది. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్లు కట్టేందుకు యత్నించింది. పేదలు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి కల్పించింది. పోలవరాన్ని నాశనం చేసింది. గోదావరి పుష్కరాల కంటే ముందే.. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం. ఎపి కి సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉంది. మత్స్యకారులకు ఉపయోగపడాలి. వేట నిషేధం సమయంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ. 20 వేలకు పెంచాం. సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నాం. సాంకేతికతతో ఎప్పటికప్పుడు అనుసంధానం చేస్తున్నాం. మనమిత్ర, వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చాం. నిన్ననే అమరావతి రాజధానిపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. చట్టం రూపుదాల్చాక రాజధానిని ఎవరూ కదల్చలేరు. హైదరాబాద్, చెన్నై కంటే అమరావతిని నెంబర్ వన్‌లో నిలబెడతాం. 63 లక్షల మందికి మొదటి తేదీనే పింఛన్లు ఇస్తున్నాం. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీశక్తి కింద మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమం అందిస్తున్నాం" అని చంద్రబాబు ప్రసంగించారు.

# మహిళల కోటాపై కదలిక



వచ్చే నెలలో జనగణన తొలి దశ ప్రారంభం కాబోతుండగా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, అందరూ చాన్నాళ్ళుగా ఎదురుచూస్తున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలకు సంబంధించిన పనులు ప్రారంభం కావాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం స్వాగతించదగ్గది. ఈ రెండింటికీ 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటారు. వాస్తవానికి 2023లో మహిళా కోటా బిల్లును ఆమోదించినప్పుడు ఆ మరుసటి సంవత్సరంలో జరిగే లోక్‌సభ ఎన్నికలకే దాన్ని వర్తింపజేయాలని విపక్షాలు కోరాయి. కానీ 2026 జనగణనకు ముందుగా ఇది సాధ్యంకాదని అప్పట్లో కేంద్రం చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనకూ దీన్నే కారణంగా చూపింది. ఈ హఠాత్ పునరా లోచనకు గల కారణమేమిటో కేంద్రం వివరించలేదు. అలాగే మహిళల కోటా నిర్ణయంలో ఎలాంటి విధానాన్ని అనుసరిస్తారన్నది కూడా చెప్పలేదు. వీటికి సంబంధించిన విధి విధానాలు పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో మాత్రమే తెలిసే అవకాశం ఉంది. పునర్విభజన ప్రక్రియపై రాజకీయ పక్షాల మధ్య స్పర్ధలున్నా మహిళల కోటా విషయంలో అన్ని పక్షాలూ ఏకాభిప్రాయంతోనే ఉన్నాయి. అయినా ఆ చట్టం అమలు వాయిదా పడింది. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలూ, మనకన్నా వెనకబడివున్న దేశాలూ కూడా మహిళలకు దశాబ్దాల క్రితమే చట్టసభల్లో కోటా ఇచ్చి గౌరవించాయి. రువాండాలో రాజ్యాంగం ప్రకారం 30 శాతం కాగా, ఆచరణలో దాదాపు 64 శాతం మంది మహిళలున్నారు. క్యూబాలో 55.7 శాతం, ఫ్రాన్స్, అర్జెంటీనా, దక్షిణాఫ్రికా, బొలివియా, మెక్సికోల్లో 50 శాతంవరకూ రిజర్వేషన్‌లున్నాయి. నేపాల్‌లో 33 శాతం కోటా అమలవుతోంది. మన ఎంపీల్లో మహిళలు 14 శాతం మించిలేరు. ఈ గణాంకాలు గమనిస్తే మనం ఎంత వెనకబడి ఉన్నామో అర్థమవుతుంది. ఈ ఏడాది జనగణన ప్రక్రియ మొదలైనా, తుది గణాంకాలకు ఏడాది పడుతుంది. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 8 దశాబ్దాలు కావస్తున్నా జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు కోటా దక్కలేదు. ఇంకా ఆలస్యం చేయొద్దనుకోవటం మంచి నిర్ణయమే. అయితే నియోజకవర్గాల పునర్విభజన వివాదాస్పదం అయ్యే అవకాశం ఉంది. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల సంఖ్య నిర్ణయించటమే ఇందుకు కారణం. 2011 గణాంకాలను ప్రాతిపదికగా తీసుకోవటంవల్ల లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాలూ 816కు ఎగబాకుతాయనీ, ఇందులో 273 స్థానాలు మహిళలకు లభిస్తాయనీ ఒక అంచనా. 2029 సార్వత్రిక ఎన్నికలకు దీన్ని వర్తింపజేస్తారు. తెలంగాణలో ఇప్పుడున్న 17 ఎంపీ స్థానాలు 26కు... 119 అసెంబ్లీ స్థానాలు 182కు పెరుగుతాయంటున్నారు. ఏపీకి ఇప్పుడున్న 25 ఎంపీ స్థానాలు దాదాపు 38కి, ప్రస్తుత 175 అసెంబ్లీ స్థానాలు 263కి చేరుతాయి. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాదిన మహిళలు చదువుల్లో, వృత్తి ఉద్యోగాల్లో ముందుండటం, కుటుంబ నియంత్రణ వంటి కారణాలవల్ల జనాభా పెరుగుదల రేటు తగ్గింది. ఉదాహరణకు 1951లో తమిళనాడు జనాభా బిహార్‌కన్నా కొంత ఎక్కువ కాగా... ఆరు దశాబ్దాల తర్వాత బిహార్ జనాభా తమిళనాడుకన్నా ఒకటిన్నర రెట్లు అధికం. జనాభా ప్రాతిపదిక కాక, రాష్ట్రాల్లోని స్థానాలపై కొంత శాతం అధికంగా సీట్లిచ్చే విధానం ఉండాలని తమిళనాడు సీఎం స్టాలిన్ సూచిస్తున్నారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం ఉండాలన్న రాజ్యాంగ అధికరణానికి ఇది విరుద్ధం.

దేశంలో ప్రతి ఒక్కరి ఓటు విలువా ఒకేవిధంగా ఉండాలన్నది దీని ఆంతర్యం. కానీ జనాభారీత్యా యూపీ ఓటరు ఓటుకుండే విలువకన్నా తమిళనాడు లేదా కేరళ ఓటరు విలువ ఎక్కువుంది. ఈ వ్యత్యాసం కొనసాగనీయటం సమర్థనీయ మేనా అన్న సందేహం తలెత్తుతుంది. ప్రతి జనగణన తర్వాత దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరగాలని రాజ్యాంగం నిర్దేశిస్తున్నా, ఇందులో ఇమిడివున్న సమస్యలను పసిగట్టి గత పాలకులందరూ వాయిదాల్లో గడిపారు. 2000 సంవత్సరం వరకూ స్తంభింపజేస్తూ 1976లో... దాన్ని 2026 వరకూ పొడిగిస్తూ 2001లో రాజ్యాంగ సవరణలు తెచ్చారు. మొత్తానికి ఈ భారం ప్రస్తుత పాలకులపై పడింది. ఎవరికీ అన్యాయం జరగకుండా, ఉత్తర--దక్షిణాల వ్యత్యాసం రాకుండా సమస్యను పరిష్కరించగలిగితే దేశ సమైక్యతకు అది దోహదపడుతుంది.

# శ్రీకాకుళం సాగునీటిని గాలికి వదిలేసిన వైసిపి

## జిల్లాకు సాగునీటి వసతి కల్పించడమే లక్ష్యం

## వంశధారతో సమస్యలను తీర్చే ప్రయత్నం

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



శ్రీకాకుళం,:ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళంలో సాగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారితమని, జిల్లా ప్రజలకు సాగునీటి భద్రత కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాను సస్యశ్యామలం చేయాలని పూనుకున్నట్లు ఆయన చెప్పారు. 2010లో వంశధార ట్రైబ్యునల్ ఏర్పాటు అయ్యిందని.. అప్పటి నుంచి నేరడి బ్యారేజ్ విషయంలో ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు ఆయన చెప్పారు. 2024లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేరడి బ్యారేజ్ సమస్యపై దృష్టి పెట్టామని ఈ సందర్భంగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వం రావటంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. వంశధార ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చుకున్నామని.. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీనిపై వైసీపీ నేతలు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అయినా తన మొదటి ప్రాధాన్యత జిల్లా అభివృద్ధికే అని రామ్మోహన్ స్పష్టం చేశారు. త్వరలో నేరడి బ్యారేజ్ పనులు ప్రారంభమవుతాయని.. రైల్వే జోన్ సాధించుకోవటం మరో విజయమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలోని ఏడు రైల్వేస్టేషన్లను కొత్త రైల్వే జోన్‌లో పెట్టించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తిరుపతి వెళ్లే భక్తుల కోసం హంసఫర్ ఎక్స్‌ప్రెస్ ఇకపై శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుందంటూ ఆయన గుడ్ న్యూస్ చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశామని.. పొందూరు ఖాదీకి జియో ట్యాగ్ సాధించామనీ వెల్లడించారు. కేంద్రం నుంచి జిల్లాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తున్నానని రామ్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆగ్రహించారు. ప్రజల కోసం పని చేసే నేతలైతే కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేసిన పనులను అభినందించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అమరావతి బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చిందని.. జగన్ పార్టీ మాత్రం బిల్లు సందర్భంగా పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందని మండిపడ్డారు. అమరావతి చట్టబద్ధత కోసం సీఎం చంద్రబాబు నాయుడు చాలా కృషి చేశారని చెప్పుకొచ్చారు. రాజధానిగా అమరావతికి రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా సంపూర్ణ మద్దతు ఇచ్చారని చెప్పుకొచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు రాజధానిపై జగన్ మూడు ముక్కలాట ఆడారని.. ఇప్పుడూ అదే డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. అమరావతి పూర్తయితే చంద్రబాబు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న భయం వైసీపీదని ఆరోపించారు. జాతీయస్థాయిలో చంద్రబాబుది ఓ ప్రత్యేక గుర్తింపని కొనియాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనేది వైసీపీ అజెండా అయితే.. చంద్రబాబుది అభివృద్ధి అజెండా అని పేర్కొన్నారు. ప్రజలు ఛీ కొట్టినా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని.. చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయమంటూ నిప్పులు చెరిగారు. విశాఖ రాజధాని పేరుతో వైసీపీ నేతలు భూదందా చేశారని ఆరోపించారు రామ్మోహన్ నాయుడు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పూర్తవుతాయని.. కేంద్రం సహకారంతో రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఒక పక్క అభివృద్ధి జరుగుతుంటే మరో పక్క వైసీపీ నేతలు గుంట నక్క రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ఆగ్రహించారు.

# సంక్షోభ సమయం




పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగానే ఉండబోతున్నదనీ, అది దీర్ఘకాలం కొనసాగుతుందనీ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన సంకేతాలు సహజంగానే అందరినీ కలవరపెడతాయి. ఆయన సోమవారం లోక్‌సభలో, మంగళవారం రాజ్యసభలో చేసిన ప్రసంగాల్లో ఆరేళ్ల క్రితం కోవిడ్ రోజుల నాటి పరిస్థితులతో వర్తమాన స్థితిని పోల్చారంటే దేశం ముమ్ముందు ఎలాంటి సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి 23 రోజుల క్రితం ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధం ట్రంప్ తాత్కాలిక విరామం ప్రకటన తర్వాత ఆగిన సంకేతాలు కనబడినా, యుద్ధ విరమణ ఉండబోదన్న ఇజ్రాయెల్ తీరు చూస్తే అందరిలోనూ సందేహాలు కలుగుతున్నాయి. అంతేకాదు... అటు ఇరాన్ సైతం అమెరికాతో చర్చించలేదని చెబుతోంది. చివరకు అదేమవుతుందన్న సంగతలా ఉంచితే, ఇప్పటికే ప్రపంచంతోపాటు మనమూ సంక్షోభంలో చిక్కుకుపోయామని తెలుస్తూనే ఉంది. క్షణక్షణం మాట మార్చే ట్రంప్‌ను ఇరాన్‌తోపాటు ప్రపంచ ప్రజానీకం కూడా పెద్దగా విశ్వసించలేదుగానీ... స్టాక్ మార్కెట్లు మాత్రం నమ్మదల్చుకున్నట్టు తాజా పరిణామాలు చెబుతున్నాయి. మార్కెట్లన్నీ మంగళవారం ఉత్సాహంతో ఉరకలెత్తాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఒక్కసారిగా 10 శాతం పడిపోయాయి. కానీ ఈ ధోరణి దీర్ఘకాలం కొనసాగటం అనుమానమే. యుద్ధంపై కేంద్రం నుంచి వెలువడిన ఈ తొలి ప్రకటన సాధారణ జనంలో కొద్ది రోజులుగా ఉన్న భయాందోళనలు నిర్హేతుకం కాదని సూచిస్తోంది. ఆర్థిక, జాతీయ భద్రతా రంగాలతోపాటు మానవతారంగంలోనూ పెను సవాళ్లను ఎదుర్కొనబోతున్నామని ప్రధాని చెబుతున్నారు. మన ఆర్థిక ప్రగతికి ప్రధానంగా తోడ్పడే చమురు, సహజవాయువుల్లో సింహభాగం పశ్చిమాసియా నుంచే రావాలి. ఆ ప్రాంతం మామూలు స్థితికి చేరేదాకా ఆ రెండు దిగుమతులపైనా అనిశ్చితి కొనసాగుతుంది. గల్ఫ్ దేశాల్లో భిన్న వృత్తి ఉద్యోగాల్లో ఉన్న కోటిమంది భారతీయుల్లో 3 లక్షల మంది ఇప్పటికే వెనక్కొచ్చారు. ఇరాన్ ప్రతిదాడుల వల్ల గల్ఫ్ దేశాల్లో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. చమురు, గ్యాస్ ఎగుమతులు నిలిచిపోవటం వల్ల అవి గడ్డు పరిస్థితుల్లో పడ్డాయి. జనం ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకీడుస్తున్నారు. తమ గ్యాస్ ఉత్పాదక క్షేత్రాన్ని చక్కదిద్దటానికి చాలా ఏళ్లు పట్టవచ్చని ఖతార్ అంటున్నది. కనుక గల్ఫ్‌లో ఉపాధి కల్పన మళ్లీ పట్టాలెక్కడం అంత సులభం కాదు. గల్ఫ్ సంక్షోభంతో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన స్థాయిలో ఎరువులు అందుతాయా అన్న సందేహాలున్నాయి. సాగుకు లోటురానీయబోమని మోదీ హామీ ఇవ్వడం అందుకే. ఆయన చెబుతున్న ప్రకారం కొన్ని శక్తులు ఈ సంక్షోభాన్ని స్వప్రయోజనాలకు వినియోగించుకునే ప్రయత్నం చేస్తాయి. అది ఆంతరంగిక భద్రతపై ప్రభావం చూపుతుంది. దేశం ఐక్యంగా ఉండి ఈ సంక్షోభాన్ని అధిగమించాలని ఆయన పిలుపునిచ్చారు. సాధారణ సమయాల్లో పెద్దగా చర్చకు రాని విదేశాంగ విధానం సంక్షోభ కాలంలో ముందుకొస్తుంది. మనది మోదీ వ్యక్తిగత విధానంగా మారిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. తమ కాలంలో ఎప్పుడూ ఇలా లేదని కూడా చెబుతున్నారు.

కానీ నాటి ద్విధ్రువ ప్రపంచం ఏకధ్రువ ప్రపంచంగా మారింది. అప్పుడు అలీన విధానం అని చెప్పుకున్నామేగానీ సోవియెట్‌కు సన్నిహితంగా మెలిగాం. అప్పట్లో అమెరికాపై దూకుడు ప్రదర్శించటం అందులో భాగమే. నిజంగా తటస్థంగా ఉన్నట్టయితే హంగేరీ (1956), జెకొస్లోవేకియా(1968), అఫ్గాన్(1979)లపై సోవియెట్ దురాక్రమణకు దిగినప్పుడు ఖండించి ఉండేవాళ్లం. మారిన పరిస్థితుల్లో భిన్న దేశాలపై వేర్వేరు అంశాల్లో ఆధారపడి ఉన్నామన్నది కాదనలేని సత్యం. నిజానికి అన్ని దేశాల పరిస్థితీ అదే. చైనా, రష్యాలు ఇరాన్‌కు గట్టి మద్దతుదార్లుగా నిలిచినా ఆపత్సమయంలో అవి తటస్థంగానే ఉండిపోక తప్పలేదు. ఉక్రెయిన్‌కు అమెరికా సాయం చేయటాన్ని చూపి, కనీసం రష్యా ఇరాన్‌కు నిఘా సమాచారాన్ని ఇచ్చింది. పరిస్థితులు ముమ్ముందు మరింత సంక్లిష్టంగా మారినా మారొచ్చు. ఈలోగా మన రాజ్యాంగ విలువలను ప్రతిబింబించే మెరుగైన విదేశాంగ విధానం రూపుదిద్దుకుంటే మంచిది.

## క్యూబాకు అండగా ఉంటాం : రష్యా ఉప విదేశాంగ మంత్రి




హవానా : అమెరికా దురాక్రమణ బెదిరింపుల నేపథ్యంలో రష్యా ఉప విదేశాంగ మంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ తాజాగా క్యూబాలో పర్యటించారు. గురువారం హవానా కన్వెన్షన్ సెంటర్‌లో సెర్గీతో క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక సంబంధాలను మరింత బలపరుచుకునే విషయాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఇప్పటికే ఉన్న సంబంధాలను మరింత పెంపొందించుకోవడానికి ఇరు దేశాలు సుముఖత వ్యక్తం చేసినట్లు క్యూబా విదేశాంగమంత్రిత్వశాఖ టెలిగ్రామ్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. క్యూబాను ప్రభావితం చేస్తున్న ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో మాస్కో అందిస్తున్న సంఘీభావ ప్రయత్నాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్‌కు డియాజ్ కానెల్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ పర్యటన సందర్భంగా 'మేము మీకు అండగా ఉంటాము' అని ర్యాబ్కోవ్ కానెల్‌కి నొక్కి చెప్పారు. ఈ పర్యటనలో ఇరు దేశాల మధ్య రాజకీయ, వాణిజ్య, పారిశ్రామిక సంబంధాలపై ఇరు ప్రతినిధి బృందాలు దృష్టి సారించాయి. ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు క్యూబాలోని పారిశ్రామిక సదుపాయాలను నిర్వహించేందుకు రష్యన్ కంపెనీలకు అధికారం ఇవ్వడం జరిగింది. ఏప్రిల్ 1న సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన 23వ రష్యా- క్యూబా అంతర్ ప్రభుత్వ కమిషన్‌లో ఈ నిర్ణయం ఖరారు చేయబడింది. ఈ కమిషన్‌లో క్యూబా ఉత్పాదక సామర్థ్యాన్ని బలోపేతం చేసే ఉమ్మడి ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ చొరవ వ్యాపార సహకారానికి కొత్త అవకాశాల్ని కలిస్తూ, పెట్టుబడుల గమ్యస్థానంగా క్యూబా ఆకర్షణను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు రష్యా పరిశ్రమ, వాణిజ్య శాఖ ఉపమంత్రి రోమన్ చెకుషెవ్ అన్నారు.

## ఉత్తర ప్రదేశ్ ఎస్ఐఆర్ జాబితా తుది జాబితాలో 84 లక్షల ఓటర్లు చేరిక





లక్నో : ఉత్తరప్రదేశ్ ఎస్ఐఆర్ తుది జాబితాను శుక్రవారం ఆ రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నవదీప్ రిన్వా విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్నోలో లోక్‌భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రిన్వా మాట్లాడుతూ ఎస్ఐఆర్ ముసాయిదా జాబితా కంటే.. తుది జాబితాలో 84 లక్షల మందికిపైగా ఓటర్లు చేరారని, మొత్తం ఓటర్ల సంఖ్య 13.39 కోట్లకు చేరిందని ఆయన వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అక్టోబర్ 7 -- 2025 నుంచి ఏప్రిల్ 10 -- 2026 వరకు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ 75 జిల్లాల్లో 403 అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాలను కవర్ చేసిందని ఆయన పేర్కొన్నారు. జనవరి 6 -- 2026న ఎస్ఐఆర్ యుసాయిదా జాబితాను రిన్వా విడుదల చేశారు. ఆ జాబితాలో 12,55,56,025 మంది ఓటర్లున్నారు. ఇందులో 6.88 కోట్ల మంది పురుషులు, 5.67 కోట్ల మంది మహిళలు, 4,199 ట్రాన్స్‌జెండర్ ఓటర్లున్నారు. 18 -- 19 వయసు గల ఓటర్లు 3,33,981 మంది ఉన్నారు. ప్రతి వెయ్యి మంది పురుషులకు 824 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇక నేడు విడుదల చేసిన తుది జాబితాలో ఓటర్ల సంఖ్య 13,39,84,792 మంది ఉన్నారు. పురుషుల ఓటర్లు 7,30,71,071 (54 శాతం), మహిళా ఓటర్లు 6,09,09,525 (45.46 శాతం), ట్రాన్స్ జెండర్ ఓటర్లు 4,206 (0.01 శాతం కన్నా తక్కువ) ఉన్నారు. ముసాయిదా జాబితా కంటే తుది జాబితాలో 18-19 వయసు గలవారు 17,63,360కి పెరిగారు. సుమారు 1.32 శాతం పెరిగింది. లింగ నిష్పత్తి కూడా మెరుగుపడింది. ప్రతి వెయ్యిమంది పురుషులకు 834 మంది మహిళా ఓటర్లున్నారు. మొత్తంగా ముసాయిదా జాబితాకు, తుది జాబితాకు 84, 28,767 మంది ఓటర్లు పెరిగారు. పెరిగిన వారిలో పురుషులు 42,27,902, మహిళలు 42,00,778 మహిళలు, 87 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు పెరిగారు. ఇక మొత్తంగా 18 -- 19 వయసు గల వారు 14,239,379 మందికి పెరగగా, లింగ నిష్పత్తి 824 నుంచి 834కి పది పాయింట్ల మేర పెరిగింది. ఓటర్లు ప్రత్యేకించి కొన్ని జిల్లాలో పెరిగారని ఎన్నికల అధికారి వెల్లడించారు. ప్రయాగ్‌రాజ్‌లో 3,29,421, లక్నో 2,85,961, బరేలీ 2,57,000, ఘజియాబాద్ 2,43,666, జౌన్‌పూర్‌లో 2,37,590 మంది ఓటర్లు పెరిగారు. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తికావడానికి ఎన్నికల అధికారులు, రాజకీయపార్టీలు, ఓటర్లను సమన్వయం చేసుకోవడం వల్లే ఇది సాధ్యమైందని సిఇఓ రిన్వా తెలిపారు. ఇక ఎస్ఐఆర్ ప్రక్రియలో 75 మంది జిల్లాల ఎలక్షన్ ఆఫీసర్లు (డిఇఓ), 403 ఇఆర్ఓ (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు), 12,758 అసిస్టెంట్ ఇఆర్ఓలు, 18,026 బిఎల్ఓ సూపర్‌వైజర్లు, 1,77,516 బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓ), 5,82,877 మంది బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

## జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా



ఢిల్లీ : అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఢిల్లీలోనితన నివాసంలో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆయనను తొలగించేందుకు అభిశంసన ప్రక్రియకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. గతేడాది మార్చి 14న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ 'జడ్జెస్ (ఇన్‌క్వైరీ) యాక్ట్, 1968' ప్రకారం ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైన విషయం తెలిసిందే.


## నితీష్‌కుమార్ రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం



పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభా నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా, ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.

# 'గింజ' నుంచి మరింత గుంజేలా..

### బియ్యంలోఇనుము, జింక్‌శోషణను రెట్టింపు చేసిన ఐఆర్‌ఆర్‌ఐశాస్త్రవేత్తల తాజాపరిశోధన
### పంట గింజ పోసుకునే దశలోఓ రసాయనం పిచికారీతోసమస్యకు చెక్
### ఇది మొక్కజొన్నతదితర పంటల్లోనూ సమర్థంగా పనిచేస్తుందన్న శాస్త్రవేత్తలు




స్పెషల్ డెస్క్ : వరి, గోధుమ వంటి ధాన్యాలను ముఖ్య ఆహారంగా తీసుకునే వారిలో ఇనుము, జింక్ వంటి సూక్ష్మపోషకాల లోపాలు కనిపిస్తున్నాయి. తగినన్ని కేలరీల ఆహారం తీసుకుంటున్నా, సూక్ష్మ పోషక లోపంతో బాధపడటాన్నే 'హిడెన్ హంగర్'అంటున్నారు. కేవలం జింక్ సరిపడా అందక ఏటా ప్రపంచవ్యాప్తంగా 8 లక్షల మంది చనిపోతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. బియ్యం, గోధుమల్లో ఉన్న ఇనుము, జింక్‌లను సైతం శోషించుకోగలుగుతున్నది చాలా తక్కువే. అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఆర్ఆర్ఐ) శాస్త్రవేత్తలు దీనిపై పరిశోధనలు చేసి, ఎట్టకేలకు అధిగమించే ఉపాయాన్ని కనుగొన్నారు.

### ఫైటిక్ ఆమ్లమే అడ్డంకి

బియ్యంలోని ఫైటిక్ ఆమ్లం అనే పోషక నిరోధక పదార్థమే ఇనుము, జింక్ వంటి సూక్ష్మపోషకాల జీవ లభ్యత (బయో ఎవైలబిలిటీ)ని తగ్గిస్తోందని గుర్తించారు. అన్నంలో సహజంగా ఉండే ఇనుము, జింక్‌లను మనకు వంటబట్టకుండా ఫైటిక్ ఆమ్లం అడ్డుపడుతోంది. దాన్యాల్లో ఫైటిక్ ఆమ్లంను తగ్గించడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు సంప్రదాయ బ్రీడింగ్, జన్యు ఇంజనీరింగ్ పద్ధతుల్లో సరికొత్త వంగడాల అభివృద్ధిపై పరిశోధనలు చేస్తున్నారు. వరి గింజలో ఉండే ఫాస్ఫరస్‌తో ఫైటిక్ ఆమ్లం ముడిపడి ఉంటుంది. దీంతో ఈ పంట రకాల పెరుగుదల, మొలక శాతం, బరువు తగ్గిపోవటం వంటి సమస్యలు వచ్చాయి.

### జింక్,ఐరన్‌ల రెట్టింపుశోషణ

ఫిలిప్పీన్స్‌లోని ఐఆర్ఆర్ఐ శాస్త్రవేత్తలు ధాన్యంలో ఫైటిక్ ఆమ్లంను విజయవంతంగా తగ్గించగలిగారు. డాక్టర్ రోవెల్ టియోజోన్ జూనియర్, డాక్టర్ నెసె శ్రీనివాసులు తదితరుల బృందం ఈ విజయం సాధించింది. ఫైటిక్ ఆమ్లం ఉత్పత్తికి మూలమైన ఐఎన్ఓ1 అనే ఎంజైమ్‌ను గుర్తించారు. దాన్ని నియంత్రించే రసాయనాన్ని గింజ పోసుకునే దశలో వరి పంటపై పిచికారీ చేయడం ద్వారా గింజల్లో పోగుపడే ఫైటిక్ ఆమ్లం పాళ్లను తగ్గించే ఉపాయాన్ని కనిపెట్టారు. దీంతో బియ్యంలో 32%, గోధుమల్లో 47% మేరకు ఫైటిక్ ఆమ్లం తగ్గింది. దీంతో సూక్ష్మపోషకాల జీవ లభ్యతతోపాటు శోషణ స్థాయి పెరిగింది. ఈ బియ్యం తిన్నవారు జింక్, ఐరన్‌లను గతంలో కన్నా రెట్టింపు స్థాయిలో వంటబట్టించుకోగలిగారని ఐఆర్ఆర్ఐ తాజాగా ప్రకటించింది.

### అనేక పంటలకు ఉపయోగం

జన్యుమారి?పడి తదితర టెక్నాలజీలతో వ్యయప్రయాసల కోర్చి ఇనుము, జింక్ అధికంగా ఉండే కొత్త ధాన్యపు పంటల వంగడాలను రూపొందించటం కన్నా.. ఇప్పటికే ఉన్న వంగడాలను సాగు చేసుకుంటూ గింజ పోసుకునే దశలో ఒక రసాయనాన్ని పిచికారీ చేస్తే సరిపోతుందని ఐఆర్ఆర్ఐ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ టెక్నిక్ వరి, గోధుమతోపాటు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, బార్లీ వంటి ఇతర పంటల్లో కూడా సమర్థవంతంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు వివరించారు.

# ఇద్దరూ ఇద్దరే




దేశ చరిత్రలో పాదయాత్రలకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. స్వాతంత్రోద్యమ కాలంలో లక్ష్య సాధన కోసం యాత్రలు చేసేవారు. ఆ తర్వాత అవి ప్రజల కోసం, సమస్యల పరిష్కారం కోసం రాజకీయ మలుపు తీసుకున్నాయి. 2003లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన పాదయాత్ర, 2017లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విభజిత ఆంధ్రప్రదేశ్‌లో చేసిన పాదయాత్ర.. ఈ రెండూ ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. మహానేత, జననేత చేపట్టిన యాత్రలు ప్రజల జీవితాల్లో.. రాష్ట్ర అభివృద్ధిలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చాయి. వాటి ఫలితంగా వచ్చిన ఐదు ప్రధాన మార్పులను ఓసారి పరిశీలిద్దాం.

విద్యా రంగం

వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో.. పేద పిల్లలకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రారంభమైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కోసం సుమారు రూ.4,000--5,000 కోట్లు ఖర్చు చేశారు. పేద పిల్లలకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించడంలో ఇది కీలక పాత్ర పోషించింది. అనేక మంది డాక్టర్లు, ఇంజినీర్లు, కలెక్టర్లు అయ్యేలా మార్గం సుగమం చేశారు.

వైఎస్ జగన్ హయాంలో.. నాడు--నేడు కార్యక్రమం ద్వారా సర్కారీ బడులను ఆధునికీకరించారు. అమ్మఒడి, జగనన్న వసతి తదితర పథకాల ద్వారా తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం అందించి.. డ్రాపవుట్లను తగ్గించి పేద పిల్లల చదువును కొనసాగించేలా చేశారు. ఒక్క అమ్మ ఒడి పథకం కోసం సుమారు రూ. 35,000 కోట్లకు పైనే నిధులు ఖర్చు చేశారు. ఈ పాలనలోనే ఇంగ్లీష్ మీడియంతో పాటు అంతర్జాతీయ సిలబస్(×దీ)తో విద్యాబోధన ప్రయత్నాలు మొదలయ్యాయి. తద్వారా ప్రపంచంతో పోటీ పడే స్థాయికి పేద విద్యార్థులను తీర్చిదిద్దాలని వైఎస్ జగన్ సంకల్పించారు.

ఆరోగ్య రంగం

వైఎస్సార్ హయాంలో.. ఆరోగ్యశ్రీ పథకం తెచ్చి పేదలకు ఉచిత వైద్య సేవలు అందించారు. రాష్ట్ర ఆరోగ్యరంగంలో విప్లవాత్మక మార్పు ఇది. ఒక అంచనా ప్రకారం.. 2007--2009 మధ్య కాలంలోనే వైఎస్ ప్రభుత్వం రూ.3,500--4,000 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేసింది.

వైఎస్ జగన్ హయాంలో.. ఆరోగ్యశ్రీ పరిధిని మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లు ఏర్పాటు చేశారు. ప్రజలకు సులభంగా వైద్య సేవలు అందేలా చేశారు. ఇందుకుగానూ సుమారు రూ.10 వేల కోట్లకు పైనే ఖర్చు చేశారు.

రైతన్న రాజ్యంలో..

వైఎస్సార్ హయాంలో.. ముఖ్యమంత్రి అయిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేసి వ్యవసాయాన్ని బలోపేతం చేశారు. రైతన్నకు రారాజును చేశారు. ఉచిత విద్యుత్ పథకంతో పా జలయజ్ఞం సాగునీటి ప్రాజెక్టులపై సుమారు రూ. 60,000 కోట్లు పైగా ఖర్చు చేశారు.

వైఎస్ జగన్ హయాంలో.. రైతు సంక్షేమం కోసం అదనంగా.. రైతు భరోసా కేంద్రాలు(=దీఖ సెంటర్లు) ఏర్పాటు చేసి, విత్తనాలు, ఎరువులు, మార్కెట్ సమాచారం అందించారు. ఇందుకుగానూ.. సుమారు రూ.4 వేల కోట్ల దాకా ఖర్చు చేశారు. మునుపెన్నడూ లేని రీతిలో పంట బీమా, తక్షణ నష్టపరిహారం అందజేశారు. ఇక.. రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.7,500 కోట్ల చొప్పున ఆర్థిక సహాయం రూపంలో రైతులకు అందజేశారు.

ఇరిగేషన్

వైఎస్సార్ హయాంలో.. అనేక సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేశారు. పోలవరం లాంటి మెగా ప్రాజెక్టు పనులను వేగవంతం చేశారు. జలయజ్ఞం ద్వారా 8.2 మిలియన్ ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం దిశగా కృషి చేశారు.

వైఎస్ జగన్ హయాంలో.. నీటి వనరుల వినియోగాన్ని సమర్థవంతంగా చేయడానికి చర్యలు తీసుకున్నారు. పోలవరం పనులను కొనసాగిస్తూ, కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించారు. పోలవరం పనులు కొనసాగిస్తూ, కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం సుమారు రూ.15,000 నుంచి 20,000 కోట్ల దాకా కేటాయించారు.

పారిశ్రామిక రంగం

వైఎస్సార్ హయాంలో.. పారిశ్రామిక వృద్ధికి పునాది వేసి, పెట్టుబడులను ఆకర్షించారు. పెట్టుబడుల్ని ఆకర్షించేందుకు వేల కోట్లు ఖర్చు చేశారు. దానికి తగ్గ ప్రతిఫలం నేటికి కళ్ల ముందు కనిపిస్తోంది.

వైఎస్ జగన్ హయాంలో.. పారిశ్రామిక అభివృద్ధి కోసం వేల కోట్లు కేటాయించారు. భారీ ఎత్తున పెట్టుబడుల్ని, కంపెనీలను రాబట్టగలిగారు. YSR Jagananna Mega Industrial Hub వంటి ప్రాజెక్టులు ప్రారంభించి.. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ప్రయత్నం చేశారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఈ ఇద్దరూ పాదయాత్రలు ప్రజలతో నేరుగా మమేకమై, వాళ్ల కష్టాలను దగ్గరగా చూశారు. ఆ పాదయాత్రల తర్వాతే ఇద్దరూ అధికారంలోకి వచ్చారు. తమ పాలనలో అన్నివర్గాల సమస్యలకు చక్కటి పరిష్కారం చూపగలిగారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా.. విద్య, ఆరోగ్యం, రైతు సంక్షేమం, ఇరిగేషన్, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో రాష్ట్ర రూపురేఖలను మార్చేశారు. జగన్ చెప్పినట్లు.. ఆయా రంగాల్లో వైఎస్సార్ వేసిన ముద్రను ఎవరూ చెరిపేయలేరేమో. కానీ, తండ్రి బాటలో పయనించి తన సంక్షేమ పాలనతో ఆ మార్క్‌ను వైఎస్ జగన్ అందుకోగలిగారనే చెప్పొచ్చు.

# 'కాల్పుల విరమణ' గందరగోళం పాపం పాక్‌దే!

### కాల్పుల విరమణ ఇరాన్ ప్రతిపాదనల్లో లెబనాన్ పేరును తొలగించి అమెరికాకు పంపిన పాకిస్తాన్
### ఆ తర్వాత పేరు చేర్చి ప్రకటన చేసిన షెహబాజ్ షరీఫ్
### భిన్న వైఖరిపై వెల్లువెత్తుతున్న విమర్శలు



మధ్యవర్తి అంటే పెద్దమనిషి తరహాలో పెద్దరికంతో, హుందాగా వ్యవహరించాలి. కానీ దశాబ్దాలుగా ఉగ్రమూకలను చంకనెత్తుకు తిరుగుతూ తమ దేశంలో ఉగ్రవాదమే లేదని బొంకే పాకిస్తాన్ అంతర్జాతీయ వేదికలపైనా అదే ధోరణిని ప్రదర్శించి మరోసారి నవ్వులపాలైంది. ఇందుకు పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య తెరమీదకొచ్చిన కాల్పుల విరమణ ప్రతిపాదనల ఘటనే సాక్ష్యంగా నిలిచింది. తమ భూభాగంతోపాట లెబనాన్ మీదా దాడులను ఆపేయాలని ఇరాన్ స్పష్టంగా పది ప్రతిపాదనలను పంపితే వాటిలోంచి 'లెబనాన్'అనే పేరును తొలగించి అమెరికా, ఇజ్రాయెల్‌లకు పాకిస్తాన్ ప్రతిపాదనలను చేరవేసిందనేది ఇప్పుడు విన్పిస్తున్న ప్రధాన ఆరోపణ. పాక్ మధ్యవర్తిత్వంలో తమకు అందిన ప్రతిపాదనల్లో 'లెబనాన్'అనే పదం ఎక్కడా లేదనేది అమెరికా, ఇజ్రాయెల్ వాదన. దీంతో పాకిస్తాన్ చేసిన అసమర్థ, అసంబద్ధ మధ్యవర్తిత్వం కారణంగా తమపై దాడులభారం తప్పట్లేదని ఇప్పుడు లెబనాన్ పాక్‌పై ఆగ్రహంగా ఉంది. పాక్ మాత్రం దీంతో తమకెలాంటి సంబంధంలేదని చేతులు దులిపేసుకునేలా మాట్లాడటం గమనార్హం. "లెబనాన్‌తో కలుపుకుని ప్రతిచోటా, ఎక్కడా దాడులు జరపబోమని ఇరాన్, అమెరికా, మిత్రదేశాల మధ్య కాల్పుల విరమణ ప్రతిపాదన అమల్లోకి వచ్చింది"అని తొలుత ప్రధాని షెహబాజ్ షరీఫ్ 'ఎక్స్'లో ఒక ట్వీట్‌చేశారు. ట్వీట్‌చేసిన కొద్దిసేపటికే లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకరదాడులు చేయడంతో కాల్పులవిరమణ ఒప్పందంలో లెబనాన్ పేరు ఉందా? లేదా? అనే గందరగోళం తలెత్తింది. ఇందుకు పాకిస్తానే కారణమని లెబనాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇరాన్ పంపిన ప్రతిపాదనలకు పాకిస్తాన్ ఏకపక్షంగా సవరణలుచేసి అమెరికాకు పంపిందని ఆరోపించింది. ఇరాన్ సైతం ఇదే వాదనలు చేసింది. తాము పంపిన వాటిని మార్చేసి అమెరికాకు పంపడంతోపాటు, అమెరికా పంపిన ప్రతిపాదనలనూ కాస్తంత అటూఇటూ మార్చేసి తమకు అందజేసిందని ఇరాన్ ఆరోపిస్తోంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సైతం పాకిస్తాన్ రెండు నాల్కల ధోరణిని పరోక్షంగా ప్రస్తావించారు. "సీజ్‌ఫైర్‌లో లెబనాన్ ఉందని ఇరాన్‌ను మధ్యవర్తిత్వ దేశాలు నమ్మించి ఉండవచ్చు. ఇందులో ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. లెబనాన్‌పై దాడి చేయబోమనే ప్రతిపాదనలకు మేం సమ్మతి తెలపలేదు"అని అన్నారు.

### ట్వీట్ సైతం అమెరికా నుంచే..

షెహబాజ్ షరీఫ్ 'ఎక్స్'ఖాతాలో ప్రత్యక్షమై ట్వీట్ సైతం సొంతంగా టైప్ చేసింది కాదు అని, అమెరికా అధ్యక్షభవనం నుంచి వచ్చిన సందేశాన్నే ఉన్నది ఉన్నట్లుగా షరీఫ్ తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్‌చేశారని తెలుస్తోంది. ఈ మేరకు న్యూయార్క్ టైమ్స్ ఒక కథనం ప్రచురించింది. సందేశం మీద తొలుత డ్రాఫ్ట్ అనే పదం కన్పించి తర్వాత అది కన్పించకుండా పోయింది. షరీఫ్ 'ఎక్స్'లో పోస్ట్‌చేయబోయే వాక్యాలను తొలుత శ్వేతసౌధం ధ్రువీకరించిందని, వైట్‌హౌస్ అనుమతితోనే షరీఫ్ ఆ సందేశాన్ని పోస్ట్‌చేశారని న్యూయార్క్‌టైమ్స్ పేర్కొంది. దీనిపై పాకిస్తాన్ నుంచి ఎలాంటి ఖండన రాకపోవడంతో ఇదే వాస్తవమనే వాదనకు బలం చేకూరింది. ఒక పక్షం వాదనలు, డిమాండ్లను అత్యంత పారదర్శకంగా మరో పక్షానికి అందించడంలో పాకిస్తాన్ విఫలమైందని, అందుకే లెబనాన్ విషయంలో సందిగ్ధత చోటుచేసుకుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# మానవులకు పంది మూత్రపిండాలు.. అవయవ మార్పిడి రంగంలో గొప్ప మలుపు!

న్యూయార్క్ : పంది మూత్ర పిండాలను మానవులకు అమర్చే రోజులు రాబోతున్నాయి. ఇతర జాతుల అవయవాలను మానవులకు అమర్చడంలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో న్యూయార్క్ విశ్వవిద్యాలయంలోని లంగోన్ హెల్త్ డాక్టర్లు అధ్యయనాలను నిర్వహించారు. సుదీర్ఘ కాలం నుంచి వేధిస్తున్న మానవ అవయవాల కొరత సమస్యను పరిష్కరించడం కోసం ఇతర జాతుల అవయవాలను ఉపయోగించగలగడంపై పరిశోధనలు చేశారు. దీనినే జెనోట్రాన్స్‌ప్లాంటేషన్ అంటారు. దీనిలో ప్రధాన సమస్య మానవ శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ. దీనికి హానికర వైరస్‌లు,



ప్రయోజనకరమైన దాతల అవయవాల మధ్య తేడా తెలియదు. వీటిలో ఏది శరీరంలో ప్రవేశించినా, దానిపైకి యాంటీబాడీస్‌ను పంపిస్తుంది. ఇవి దాత అవయవానికి హాని చేయగలవు. ఫలితంగా అవయవ మార్పిడి విఫలమవుతుంది. బ్రెయిన్ డెడ్ అయిన 57 ఏళ్ల వయసు గల పురుషునికి ఎన్‌వైయూ పరిశోధకులు పంది మూత్రపిండాలను విజయవంతంగా అమర్చారు. ఈ పంది మూత్రపిండాలను జన్యుపరంగా మార్పులు చేశారు. ఆయనను రెండు నెలలపాటు లైఫ్ సపోర్ట్‌పై ఉంచారు. ఆ సమయంలో క్రమం తప్పకుండా ఈ కొత్త అవయవంపై బయాప్సీ చేశారు. పంది అవయవం పట్ల రోగిలోని రోగ నిరోధక వ్యవస్థ ఏ విధంగా స్పందించిందో గుర్తించారు. 5,100 పంది, మానవ జన్యువులను మ్యాప్ చేశారు. శరీరంలోని ప్రతి రోగ నిరోధక కణాన్ని గుర్తించారు. ఈ విధానాలను మరో 20 మంది రోగులపై ప్రయోగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# చిక్కుడు కాయలను తినడం లేదా..? అయితే ఈ అద్భుతమైన లాభాలను మీరు కోల్పోయినట్లే..!



మనకు ఏడాది పొడవునా అందుబాటులో ఉండే కూరగాయల్లో చిక్కుడు కాయలు కూడా ఒకటి. ఇవి సాధారణంగా మనకు రెండు రకాలుగా లభిస్తాయి. గింజలు, కాయ లావుగా ఉండే చిక్కుడు కాయలు, ఆయా భాగాలు పలుచగా, వెడల్పుగా ఉండే కాయలు.. ఇలా చిక్కుడు కాయలు రెండు రకాలుగా లభిస్తాయి. మొదటి రకానికి చెందిన చిక్కుడు కాయలను అడవి చిక్కుడు అని కూడా పిలుస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ కాయలు ఎక్కువగా కాస్తాయి. ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. ఇక రెండో రకానికి చెందిన చిక్కుళ్లు మనకు అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. అయితే చిక్కుడు కాయలను తినేందుకు చాలా మంది అంతగా ఆసక్తిని చూపించరు. కానీ ఇవి మనకు అనేక పోషకాలను, ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. చిక్కుడు కాయలను తరచూ తింటే అనేక లాభాలను పొందవచ్చు. ఇవి మన శరీరానికి పోషణను అందిస్తాయి. రోగాలు రాకుండా చూస్తాయి.

### నాన్ వెజ్ తినని వారికి..

చిక్కుడు కాయలను తరచూ తినడం వల్ల వృక్ష సంబంధ ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. నాన్ వెజ్ తినని వారికి చిక్కుళ్లను చక్కని ప్రత్యామ్నాయ ఆహారంగా చెప్పవచ్చు. వీటిని తింటే ప్రోటీన్లను సమృద్ధిగా పొందవచ్చు. దీని వల్ల కండరాలకు మరమ్మత్తులు జరుగుతాయి. కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. శారీరక శ్రమ, వ్యాయామం చేసే వారికి చిక్కుళ్లు ఎంతో దోహదం చేస్తాయి. వీటి వల్ల కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. చక్కని దేహ ధారుఢ్యం సొంతమవుతుంది. ఇవి శరీరానికి ఎంతో శక్తిని అందించి ఉత్సాహంగా, యాక్టివ్‌గా ఉండేలా చేస్తాయి. వీటిని తినడం వల్ల నీరసం, అలసట తగ్గుతాయి. బద్దకం పోతుంది. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఇక వీటిని తినడం వల్ల ప్రోటీన్లు, ఫైబర్‌ను సమృద్ధిగా పొందవచ్చు. అందువల్ల ఈ కాయలను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు ఎంతగానో సహాయం చేస్తుంది.

### రక్తహీనతకు..


చిక్కుళ్లలో ఉండే ఫైబర్ వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి ఉండదు. ముఖ్యంగా మలబద్దకం తగ్గుతుంది. చిక్కుళ్లు ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. అందువల్ల వీటిని తింటుంటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణ సమస్యలు రాకుండా చేస్తుంది. చిక్కుళ్లలో అధికంగా ఉండే ఐరన్ వల్ల ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందుతాయి. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రక్తం తక్కువగా ఉన్నవారు తరచూ చిక్కుళ్లను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. అలాగే వీటిని తింటే ఫోలేట్ సైతం సమృద్ధిగా లభిస్తుంది. ఇది గర్భిణీలకు ఎంతో మేలు చేస్తుంది. గర్భస్థ శిశువు ఆరోగ్యానికి, ఎదుగుదలకు సహాయం చేస్తుంది. శిశువుకు పుట్టుక లోపాలు రాకుండా జాగ్రత్త పడవచ్చు.

### ఎముకల ఆరోగ్యానికి..

చిక్కుళ్లలో అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవి మన శరీరానికి శక్తిని అందిస్తాయి. మనం తిన్న ఆహారం నుంచి శక్తి శరీరానికి అందేందుకు దోహదం చేస్తాయి. చిక్కుళ్లను తినడం వల్ల వాటిల్లో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. రక్తనాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. చిక్కుళ్లలో ఉండే పొటాషియం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. చిక్కుళ్లో మాంగనీస్, కాపర్ సైతం అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల నిర్మాణానికి, సాంద్రత పెరిగేందుకు దోహదం చేస్తాయి. దీని వల్ల ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా చిక్కుడు కాయలను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. కనుక ఇకపై చిక్కుళ్లు కనిపిస్తే విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు.

# చలికాలంలో చర్మం పగలకుండా సురక్షితంగా, కాంతివంతంగా ఉండాలంటే ఈ ఆహారాలను తినండి..!

చలికాలంలో చాలా మందికి సహజంగానే చర్మం పగులుతుంది. కొందరికి చర్మం పగలడంతోపాటు దురదలు కూడా వస్తుంటాయి. చర్మంపై పొట్టు రాలి అంద విహీనంగా కూడా కనిపిస్తుంది. చర్మం కాంతిహీనంగా మారి డల్‌గా కనిపిస్తుంది. ఈ క్రమంలోనే చలికాలంలో చర్మాన్ని రక్షించుకోవడం కష్టంగా మారుతుంది. అయితే చలికాలంలో చల్ల గాలి వల్ల చర్మంలో ఉండే తేమ బయటకు వెళు ంది. దీంతో చర్మం పొడిగా మారుతుంది. ఫలితంగా చర్మం పొట్టు రాలడం, దురదగా ఉండడం వంటివి సంభవిస్తాయి. అయితే చలికాలంలో ఆహారం విషయంలో అనేక మార్పులు చేసుకుంటే దాంతో చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు ఉండే ఆహారాలను తీసుకుంటే ఈ సీజన్‌లో చర్మానికి ఎంతో మేలు జరుగుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.



### ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు..

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను తీసుకుంటే చర్మం సురక్షితంగా ఉంటుంది. ఇవి శక్తివంతమైన యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను సైతం కలిగి ఉంటాయి. అందువల్ల చర్మంపై ఉండే ఎరుపుదనం, దురద వంటివి తగ్గిపోతాయి. చర్మ కణాలు సురక్షితంగా ఉంటాయి. చర్మంలో ఉండే తేమ బయటకు వెళ్లకుండా అడ్డుకోవచ్చు. దీంతో చర్మం పొడిబారకుండా తేమగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు మనకు ఎక్కువగా చేపలు, వాల్ నట్స్, అవిసె గింజలు, చియా విత్తనాలు, అవకాడో, ఆలివ్ ఆయిల్, బాదంపప్పు, బ్రెజిల్ నట్స్, పొద్దు తిరుగుడు విత్తనాలు వంటి ఆహారాల్లో లభిస్తాయి. వీటిల్లో ఆరోగ్యకరమైన కొవ్వులతోపాటు విటమిన్ ఇ, జింక్ అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి చర్మాన్ని సురక్షితంగా ఉంచుతాయి.

### కూరగాయలు, పండ్లు..

నీటి శాతం అధికంగా ఉండే పండ్లు, కూరగాయలను తీసుకుంటున్నా కూడా చర్మానికి మేలు జరుగుతుంది. ఇవి చర్మానికి కావల్సిన తేమను అందిస్తాయి. చర్మం పొడిబారకుండా చూస్తాయి. కీరదోస, కొత్తిమీర, పుచ్చకాయ, నారింజ పండ్లు వంటి ఆహారాలను తీసుకుంటే మేలు జరుగుతుంది. అలాగే చికెన్ లేదా వెజిటబుల్ సూప్‌లను తాగవచ్చు. ఇవి కూడా చర్మానికి కావల్సిన తేమను అందించి చర్మాన్ని పగలకుండా చూస్తాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను తినడం వల్ల కూడా చర్మానికి సంరక్షణ లభిస్తుంది. వీటి వల్ల చర్మ కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. చర్మ కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. దీంతో చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా క్యాప్సికం, బ్రోకలీ, కివి, పాలకూర, క్యారెట్లు, చిలగడదుంపలు, గుమ్మడికాయలు, పప్పు దినుసులు, శనగలు వంటి ఆహారాల్లో లభిస్తాయి. కనుక వీటిని తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

### ప్రో బయోటిక్ ఆహారాలు..

ప్రో బయోటిక్ ఆహారాలను ఈ సీజన్ లో రోజూ తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇవి చర్మ కణాలను రక్షిస్తాయి. చర్మం వాపులకు గురి కాకుండా చూస్తాయి. దీని వల్ల చర్మం పగలకుండా సురక్షితంగా ఉంటుంది. పెరుగు, మజ్జిగ, పాలు వంటివి ఈ కోవకు చెందుతాయి. కనుక ఈ ఆహారాలను ఈ సీజన్‌లో కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇక చలికాలంలో చర్మం సురక్షితంగా ఉండాలంటే మద్యం అతిగా సేవించకూడదు. అలాగే టీ, కాఫీలను కూడా మరీ అతిగా తాగకూడదు. చక్కెర పానీయాలను తీసుకోవడం మానేయాలి. ప్రాసెస్ చేయబడిన ఆహారాలను ఎట్టి పరిస్థితిలోనూ తీసుకోకూడదు. ఈ విధంగా ఆహారం విషయంలో పలు జాగ్రత్తలను పాటిస్తే చలికాలంలో చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. చర్మం పగలకుండా ఉంటుంది.



# ఒక్కసారి చార్జింగ్ చేస్తే 172 కిలోమీటర్ల మేర మైలేజ్.. సరికొత్త ఎలక్ట్రిక్ బైక్‌ను లాంచ్ చేసిన మ్యాటర్ మోటార్ వర్క్స్..

ప్రస్తుతం మన దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల హవా నడుస్తోంది. దేశంలో రోజు రోజుకీ పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి ఆకాశాన్నంటుతుండడంతో ప్రజలు విద్యుత్ వాహనాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. ముఖ్యంగా రోజువారి ప్రయాణం కోసం చాలా మంది ఎలక్ట్రిక్ టూవీలర్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ రంగంలో అనేక మోటార్ సైకల్స్, స్కూటర్లు వచ్చేశాయి. ఇదే కోవలో తాజాగా మ్యాటర్ మోటార్ వర్క్స్ అనే కంపెనీ కూడా ఓ నూతన మోటార్ సైకిల్‌ను భారత మార్కెట్‌లో విడుదల చేసింది. ఏరా 5000 ప్లస్ పేరిట ఈ మోటార్ సైకిల్‌ను చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో లాంచ్ చేశారు. ఈ మోటార్ సైకిల్‌లో పలు అద్భుతమైన ఫీచర్లను అందిస్తున్నారు.

### 172 కిలోమీటర్ల మైలేజ్..

మ్యాటర్ మోటార్ వర్క్స్‌కు చెందిన ఏరా 5000 ప్లస్ మోటార్ సైకిల్‌ను భారతీయ రోడ్లకు అనుగుణంగా రూపొందించారు. ఇందులో హైపర్ షిఫ్ట్ టెక్నాలజీ ఆధారంగా నడిచే 4 స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. దీని వల్ల వాహనాన్ని చాలా స్మూత్‌గా నడిపే అవకాశం ఉంటుంది. ఈ మోటార్




సైకిల్‌లో 3 రకాల రైడ్ మోడ్స్‌ను అందిస్తున్నారు. 5 కిలో వాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌ను ఇచ్చారు. ఈ బ్యాటరీని ఒక్కసారి ఫుల్ చార్జింగ్ చేస్తే ఏకంగా 172 కిలోమీటర్ల వరకు మైలేజ్‌ను అందిస్తుందని కంపెనీ చెబుతోంది. ఈ మోటార్ సైకిల్‌కు ఐపీ 67 డస్ట్ అండ్ వాటర్ ప్రొటెక్షన్‌ను సైతం అందిస్తున్నారు. ఈ




బైక్‌కు 7 ఇంచుల స్మార్ట్ టచ్ స్క్రీన్ డ్యాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో బైక్‌కు చెందిన నావిగేషన్ ఫీచర్‌తోపాటు మ్యూజిక్, రైడ్ డేటా వంటి సదుపాయాలను యాక్సెస్ చేయవచ్చు. అలాగే ఓటీఏ ద్వారా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్‌ను సైతం పొందవచ్చు.

### కిలోమీటర్ కు 25 పైసల ఖర్చు..

ఈ బైక్‌కు స్మార్ట్ చార్జింగ్ ఫీచర్‌ను అందిస్తున్నారు. దీనికి ఆన్ బోర్డ్ చార్జర్ లభిస్తుంది. 1 లక్షకు పైగా చార్జింగ్ పాయింట్లను యాక్సెస్ చేయవచ్చు. 2.8 సెకన్ల వ్యవధిలో సుమారుగా గంటకు 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఈ బైక్‌కు డ్యుయల్ డిస్క్ బ్రేక్‌లను ఇచ్చారు. వీటికి ఏబీఎస్ సదుపాయం కూడా ఉంది. డ్యుయల్ సస్పెన్షన్‌ను ఇచ్చారు. అలాగే పార్కింగ్ అసిస్టెంట్ సదుపాయం కూడా ఉంది. ఈ బైక్‌కు గాను మ్యాటర్ వర్స్ మొబైల్ యాప్‌ను అందిస్తున్నారు. దీని సహాయంతో బైక్‌ను లైవ్‌లో ట్రాక్ చేయవచ్చు. అలాగే రిమోట్ లాక్, అన్‌లాక్ సదుపాయం కూడా ఉంది. రైడ్ హిస్టరీని యాప్ లో యాక్సెస్ చేయవచ్చు. ఈ బైక్‌కు స్మార్ట్ కీ సదుపాయం ఉంది. అందువల్ల బైక్‌ను కీ లేకుండానే స్టార్ట్ చేయవచ్చు. ఈ బైక్‌ను నిర్వహించడం కూడా చాలా తేలికే. ఒక కిలోమీటర్‌కు సుమారుగా 25 పైసల ఖర్చు వస్తుందని కంపెనీ చెబుతోంది. దీని వల్ల 3 ఏళ్లలో సుమారుగా రూ.1 లక్ష వరకు పొదుపు చేయవచ్చని చెబుతున్నారు.

### ధర వివరాలు..

మ్యాటర్ మోటార్ వర్క్స్ ఏరా 5000 ప్లస్ మోటార్ సైకిల్ గంటకు గరిష్టంగా 105 కిలోమీటర్ల వేగంతో వెళ్లగలదు. బ్యాటరీ ఫుల్ చార్జింగ్ చేస్తే సుమారుగా 172 కిలోమీటర్ల మైలేజ్ వస్తుంది. సిటీ రోడ్లపై ట్రాఫిక్‌లో అయితే సుమారుగా 125 కిలోమీటర్ల మైలేజ్ వస్తుంది. ఎకో, సిటీ, స్పోర్ట్ అనే రైడ్ మోడ్స్‌ను ఇందులో అందిస్తున్నారు. ఈ బైక్‌లో అందించే బ్యాటరీకి లైఫ్ టైమ్ వారంటీ సదుపాయం కూడా ఉంది. ఈ బైక్‌కు గాను ట్యూబ్‌లెస్ టైర్లను అందిస్తున్నారు. ఆండ్రాయిడ్ 11 ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా ఈ బైక్ పనిచేస్తుంది. 3జీబీ ర్యామ్, 4జీ ఎల్‌టీఈ, వైఫై, బ్లూటూత్, జీపీఎస్ వంటి సదుపాయాలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ బైక్‌కు 3 ఏళ్ల వరకు వారంటీ లభిస్తుంది. ఈ బైక్‌ను కాస్మిక్ బ్లాక్, కాస్మిక్ బ్లూ, గ్లేసియర్ వైట్, బ్లేజ్ రెడ్, నోర్డ్ గ్రే కలర్ ఆప్షన్లలో లాంచ్ చేశారు. ఈ బైక్‌కు చెందిన ఎక్స్-షోరూం ధర రూ.1,93,826 గా ఉంది. దీన్ని చెన్నైలో ఉన్న ఈ కంపెనీ షోరూంలో కొనుగోలు చేయవచ్చు. లేదా ఈ కంపెనీకి చెందిన అధికారిక వెబ్‌సైట్‌లోనూ ఆర్డర్ చేయవచ్చు.



NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -“APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,“D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .